ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
అనంతపురం, రాప్తాడు, శింగనమల :9985411608
తాడిపత్రి, : 7659062646,
గుంతకల్లు, ఉరవకొండ, : 9985411657,
కళ్యాణదుర్గం, :9701120019,
రాయదుర్గం, : 9000406723,
ఏసీఎం: 9985411154

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం 44.0 28.0



ఎవరు ముందొస్తారో..

గాడిదలపై పరుగులు

ఉరవకొండ, ఏప్రిల్ 29: వజ్రకరూరులో జనార్దన వేంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని పురష్కరించుకుని గాడిదల పరుగు పోటీలను సోమవారం నిర్వహించారు. రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. పోటీలో ఎనిమిది గాడిదలు పాల్గొనగా, మురిడికి చెందిన తిప్పే స్వామి గాడిద మొదటి బహుమతి దక్కించుకుంది. రాయదుర్గం మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన మల్లేష్ గాడిద రెండో స్థానం దక్కించుకుంది. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.8 వేలను నిర్వాహకులు సురేంద్ర, గురుస్వామి, సురేష్ అందజేశారు.



నగదు బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

మరో ఇద్దరిపై వేటు

అనంతపురం టౌన్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన మరో ఇద్దరిపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు వినోద్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం కొత్తూరు గ్రామ వలంటీరు ఎం.నాగరాజు, యర్రగుంట గ్రామ గోపాలమిత్ర ఎం.ఓబయ్యను విధులను తొలగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.



ఎంపీ అభ్యర్థులు 21 మంది
ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 113 మంది
అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

ఇక సమర భేరి..!

అనంతపురం టౌన్, ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగిసి.. అభ్యర్థుల తుది జాబితా తేలింది. ఎంపీ అభ్యర్థులలో ఏ ఒక్కరూ తమ నామినేషనన్లు ఉపసంహరించుకోలేదు. మొత్తం 21 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ప్రకటించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 136 మంది నామినేషన్లు వేశారు. వీరిలో 23 మంది ఉపసంహరించుకున్నారు. రాయదుర్గంలో ఒకరు, గుంతకల్లులో ముగ్గురు, తాడిపత్రిలో ఎనిమిది మంది, శింగనమలలో ఇద్దరు, అనంతపురం అర్బన్‌లో ఆరుగురు, కల్యాణదుర్గంలో ఒకరు, రాప్తాడులో ఇద్దరు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఒక్కరు కూడా నామినేషన్లను ఉపసంహరించుకోలేదు. బరిలో ఉన్న వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు.

ఇక మోత..

అభ్యర్థుల తుది జాబితా ఖరారు కావడంతో పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్రులు ప్రచారంపై పూర్తిస్థాయి దృష్టి సారించనున్నారు. బరిలో ఎంతమంది ఉన్నా.. టీడీపీ కూటమి, వైసీపీ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని భావిస్తున్నారు. ఎన్డీఏ, స్వతంత్ర అభ్యర్థులు చీల్చే ఓట్ల ప్రభావం ఎవరిపై ఉంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థులు మంగళవారం నుంచి ప్రచార వేగాన్ని పెంచేందుకు సిద్ధమయ్యారు. ఎత్తులు.. పై ఎత్తులు.. వ్యూహాలకు పదును పెడుతున్నారు.



నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియలో కలెక్టరు వినోద్ కుమార్


ప్రధాన పార్టీల తరపున..

నియోజకవర్గం	టీడీపీ కూటమి	వైసీపీ	ఇండియా కూటమి
రాయదుర్గం	కాలవ శ్రీనివాసులు	మెట్టు గోవింద రెడ్డి	ఎంబీ చిన్న అప్పయ్య
ఉరవకొండ	పయ్యావుల కేశవ్	వై. విశ్వేశ్వర రెడ్డి	వై.మధుసూదన్ రెడ్డి
గుంతకల్లు	గుమ్మనూరు జయరాం	వై.వెంకట్రామి రెడ్డి	కావలి ప్రభాకర్
తాడిపత్రి	జేసీ అశ్మిత్‌రెడ్డి	కేతిరెడ్డి పెద్దారెడ్డి	గుజ్జల నాగిరెడ్డి
శింగనమల (ఎస్సీ)	బండారు శ్రావణిశ్రీ	ఎం.వీరాంజనేయులు	సాకే శైలజానాథ్
అనంతపురం అర్బన్	డి.వెంకటేశ్వర ప్రసాద్	ఎ.వెంకట్రామిరెడ్డి	సి.జాఫర్
కళ్యాణదుర్గం	ఎ.సురేంద్రబాబు	తలారి రంగయ్య	పి.రామ్‌భూపాల్ రెడ్డి
రాప్తాడు	పరిటాల సునీత	తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి	ఎ.ఆంధ్రా శంకరయ్య

పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య

నియోజకవర్గం	అభ్యర్థుల సంఖ్య
అనంతపురం లోక్‌సభ	21
రాయదుర్గం	13
ఉరవకొండ	11
గుంతకల్లు	14
తాడిపత్రి	18
శింగనమల	14
కళ్యాణదుర్గం	15
రాప్తాడు	13
అనంతపురం అర్బన్	15

5న అనంతకు చంద్రబాబు



అనంతపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు వస్తున్నారు. మే 5న రాప్తాడు నియోజకవర్గంలో ఎన్నికల బహిరంగ సభను నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం అనంతపురం నగరంలోని ప్రధాన రోడ్లల్లో రోడ్ షోలో పాల్గొంటారు. చంద్రబాబు పర్యటన వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

పింఛన్ నిధులు విడుదల



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 29: మే నెల పింఛన్‌లకోసం జిల్లాకు రూ.86.33 కోట్ల నిధులు విడుదలయ్యాయి. మొత్తం 2,88,334 మంది లబ్ధిదారులకు ఈ సొమ్మును కేటాయించారు. గత నెలలో 2,89,131 మందికి పింఛన్ మంజూరు చేశారు. ఈ నెల 797 పింఛన్లు తగ్గాయి. నిధులను కూడా రూ.25 లక్షలు తగ్గించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ నెల పింఛన్ల పంపిణీపై గందరగోళం సృష్టించారు. వృద్ధులు, విభిన్నప్రతిభావంతులు, ఇతర లబ్ధిదారులు నానా అవస్థలు పడ్డారు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో పింఛన్ సొమ్ము జమ చేస్తామని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి ప్రకటించారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 29: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 3 నుంచి 9వ తరగతుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయులు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 9 పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. 3వ తరగతిలో మాత్రమే ఎస్టీ 30, ఎస్సీ 05, బీసీ 02, ఓసీ 1, ఏఈక్యు 1 చొప్పున రిజర్వేషన్ విధానంలో ఖాళీలను భర్తీ చేస్తామని అన్నారు. 4 నుంచి 9 తరగతుల వరకూ ఎస్టీ విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలకు అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు మే 1వ తేదీ నుంచి 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంబంధిత గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని సూచించారు.

పూర్తికాని గ్రామీణ రహదారుల పనులు

పట్టించుకోని కాంట్రాక్టర్
కంకర రోడ్లపై ప్రయాణికుల ఇబ్బందులు
రాప్తాడు ఎమ్మెల్యే ఇలాకాలో రోడ్ల దుస్థితి

పల్లె రోడ్ల ప్రగతి ఇంతేనా?



అధికారం చేతిలో ఉన్నా సొంతూరి చుట్టుపట్ల గ్రామాలకు తారురోడ్డు వేయించుకోలేకపోయాడనే విమర్శలు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మూటగట్టుకున్నాడు. ఆత్మకూరు మండలంలో బి. యాలేరు నుంచి తగరకుంట వరకూ డబుల్‌లేన్ తారు రోడ్డు నిర్మాణం చేయుటకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్ ఆ పనులు అరకొరగా చేశారు. కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తి చేసి కొంత దూరం మాత్రమే తారు రోడ్డు వేసి మమ అనిపించారు. నిత్యం ఆదారి గుండా ప్రయాణించే వాహనదారులు రోడ్డు సక్రమంగా ఎప్పుడు పూర్తి చేస్తారోనని ఎదురు చూస్తున్నారు.

- రాప్తాడు

తోపుదుర్తి (తోపుదుర్తి దాటగానే) నుంచి పాలచెర్లకు వెళ్లే రోడ్డులో కంకర తేలిన దారి

ఏళ్లు గడుస్తున్నా 6 కి.మీ తారు రోడ్డే



తోపుదుర్తి నుంచి రంగంపేట వరకూ సింగిల్ లేన్ తారురోడ్డు (గతంలో నిర్మించినది)



పాలచెర్ల నుంచి భోగినేపల్లికి వెళ్లే దారిలో తేలిన కంకర

ఆత్మకూరు మండలంలోని బి. యాలేరు నుంచి సనప, రంగం పేట, తోపుదుర్తి రాప్తాడు మండలంలోని పాలచెర్ల, భోగినేపల్లి కనగానపల్లి మండలంలోని తగరకుంట గ్రామం వరకూ గతంలో సింగల్‌లేన్ తారు రోడ్డు ఉండేది. రోడ్డు అక్కడక్కడా గుంతలమయంగా ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక బి. యాలేరు నుంచి తగరకుంట వరకూ 25 కి.మీ డబుల్‌లేన్ తారురోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్‌అండ్‌బీకి రూ. 52 కోట్లు నిధులు మంజూరు చేసింది. డబుల్‌లేన్ తారురోడ్డు నిర్మాణం చేయాలని గతంలో నిర్మించిన సింగల్‌లేన్ తారురోడ్డు తవ్వేసి కంకర వేశారు. కొన్ని చోట్ల పాత తారురోడ్డు తొలగించ కుండా అలాగే ఉంచారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2021లో పనులు ప్రారంభించి 2023లోగా పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ మొదటి నుంచి నత్తనడకన పనులు చేశారు. యాలేరు నుంచి తగరకుంట వరకూ కల్వర్టుల నిర్మాణం, కంకర పరిచేందుకే దాదాపు ఏడాదిన్నర పట్టింది. ఆ తరువాత రోడ్డు పనులు ప్రారంభించారు. యాలేరు నుంచి సనప మీదుగా రంగంపేట వరకూ 6 కి.మీ మాత్రమే డబుల్‌లేన్ తారురోడ్డు నిర్మించారు. రంగంపేట నుంచి తోపుదుర్తి వరకూ డబుల్‌లేన్ తారురోడ్డు వేయలేదు. గతంలో నిర్మించిన సింగల్‌లేన్ తారు రోడ్డు అలాగే ఉంది. తోపుదుర్తి నుంచి పాలచెర్ల, భోగినేపల్లి, తగరకుంట వరకూ రోడ్డే వేయలేదు. గతంలో ఉన్న సింగల్‌లేన్ తారు రోడ్డు తొలగించి కంకర వేసి వదిలేశారు. కంకర పరచిన దారిలో వెలుతూ నిత్యం వాహనదారులు ఇబ్బంది పడుతు న్నారు.



యాలేరు చెరువు కట్ట వద్ద నుంచి రంగంపేట వరకూ 6 కి.మీ మాత్రమే నిర్మించిన డబుల్ లేన్ నూతన తారురోడ్డు

ఇంకెప్పుడు పూర్తి చేస్తారో?

రోడ్డు పనులు ప్రారంభించి రెండేళ్లవుతున్నా 25 కి.మీ తారు రోడ్డు కూడా నిర్మించలేకపోతున్నారని వాహనదారులు అసహ నం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నా తన సొంతూరు చుట్టు పక్కల గ్రామాలకు నిధులు మంజూరైనా రోడ్డు వేయించలేకపోతు న్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం

అనివార్య కారణాల వలన రోడ్డు తారు రోడ్డు నిర్మాణం ఆసల్యమైంది. త్వరలోనే రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.
- ప్రసాద్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ

తారు రోడ్డు నిర్మించాలి: ఉజ్జినప్ప, సర్పంచ్, భోగినేపల్లి



అనంతపురం నుంచి తోపుదుర్తి మీదుగా మా గ్రామానికి సింగల్‌లేన్ తారు రోడ్డు ఉండేది. డబుల్‌లేన్ తారు రోడ్డు నిర్మిస్తామని రెండేళ్ల కిందట ఉన్న రోడ్డును తొలగించి కంకర వేశారు. అప్పటి నుంచి తారు రోడ్డు వేయలేదు. కల్వర్టులు మాత్రమే పూర్తి చేశారు. కంకర తేలిన దారిలో వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి.

ఉన్న రోడ్డు తొలగించారు: రాము, భోగినేపల్లి



డబుల్‌లేన్ తారు రోడ్డు నిర్మిస్తామని గతంలో ఉన్న సింగల్‌లేన్ తారు రోడ్డు తొలగించారు. కంకర వేసి వదిలేశారు. రోడ్డు వేయకుండా కాలయాపన చేస్తున్నారు. పాలచెర్ల, భోగినేపల్లి, తగరకుంట గ్రామాల ప్రజలు అనంతపురం, రాప్తాడుకు వెళ్లాలంటే తోపుదుర్తి మీదుగానే వెళ్లాలి. కంకర తేలిన దారిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



విచారణకు అడ్డంకులు..?

టవర్ డంప్ ఇవ్వకుండా ఒత్తిళ్లు

విందులో పాల్గొన్న టీచర్లకు వైసీపీ అండ



అనంతపురం విద్య, ఏప్రిల్ 29: రాజకీయ విందులో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల గుర్తింపునకు జరుగుతున్న ప్రయత్నాలకు అడ్డంకులు ఎదురవుతున్నట్లు తెలిసింది. విందులో పాల్గొన్నవారంతా అనంతపురం అర్బన్, రూరల్ ప్రాంత ఉపాధ్యాయులేనని సమాచారం. వీరిలో అధికశాతం మంది అనంతపురం అర్బన్ ఓటర్లు. ఎక్కువశాతం వైసీపీ మద్దతుదారులు. గత నెల 31న ఈ రాజకీయ విందు జరిగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉల్లంఘనలపై నిజాయితీగా విచారిస్తున్న అధికారులకు అధికార పార్టీ నేతలు, కొందరు అధికారులు అడ్డుపడుతున్నట్లు సమాచారం. విచారణను ఎలాగైనా తొక్కి పెట్టాలని కొందరు చూస్తున్నారు. అందులో భాగంగానే టవర్ డంప్ రిపోర్టు బయటకు రాకుండా తొక్కి పెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.



వైసీపీకి లబ్ధి చేకూర్చేలా..

ఎన్నికల్లో అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా కొందరు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు వ్యవహరించారు. వైసీపీకి అనుబంధంగా నడిచే ఒక ఉపాధ్యాయ సంఘం, మరో అనుయాయ ఉపాధ్యాయ సంఘం నాయకులు, పలువురు పీడీలు, ప్రధానోపాధ్యాయులు గత నెల 31న అనంతపురం నగర శివారులోని ఓ డాబాలో రాజకీయ విందు నడిపారు. దీనికి ఒక వైసీపీ ఎమ్మెల్యే సైతం హాజరు కావడంతో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విందులో అనంతపురం అర్బన్, రూరల్ ప్రాంతంలోని పలు ప్రభుత్వ పాఠశాలల టీచర్లు, వైసీపీ సామాజికవర్గం టీచర్లు పాల్గొన్నారని ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. ఓ ఎంఈఓ కూడా ఉడతా భక్తిగా సాయపడ్డారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన కూడా వైసీపీ ఎమ్మెల్యేకు వీరవిధేయుడని, డిన్నర్‌కు వెళ్లిన ఉపాధ్యాయులను అండగా ఉన్నారని సమాచారం.

15 రోజులపైగానే...

రాజకీయ విందుపై జడ్పీ సీఈఓ దర్యాప్తును ముమ్మరం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. వైసీపీకి కొమ్ముకాచేలా రాజకీయ విందుకు హాజరైన వారి వివరాలు కోరుతూ.. సుమారు పక్షం రోజుల కిందట ఎస్పీకి లేఖ రాసినట్లు సమాచారం. అయితే విచారణాధికారికి పోలీస్ శాఖ నుంచి ఎలాంటి సమాచారం రాలేదని తెలుస్తోంది. సమాచారం ఇవ్వకుండా కొందరు వైసీపీ ప్రజాప్రతినిధులు అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. వైసీపీ వెంట నడిచే టీచర్లు, ఆ పార్టీకి పరోక్షంగా ప్రచారం చేస్తున్న టీచర్లను కాపాడుకోడానికే అధికార పార్టీవారు ప్రయత్నాలు చేస్తున్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఓకే..!

దిగివచ్చిన ఎస్కేయూ యాజమాన్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 29: డిగ్రీలో సబ్జెక్టులు మిగిలిపోయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఎస్కేయూ యాజమాన్యం నిర్ణయించింది. దీంతో పరీక్షల కోసం కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న విద్యార్థులకు ఊరట లభించింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సప్లిమెంటరీ పరీక్షలకు కొర్రీలు పెడుతూ వచ్చింది. దీంతో డిగ్రీ విద్యార్థులు ఫెయిల్ అయిన ఎస్కేయూ విద్యార్థులు సబ్జెక్టులను పూర్తిచేసుకోలేకపోయారు. ఈ సమస్యపై ఆంధ్రజ్యోతిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. అప్పటి వీసీ రామకృష్ణారెడ్డి తీరు తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ఆయన వైసీపీ నాయకుడి తరహాలో వ్యవహరిస్తున్నారని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు సైతం నిర్వహించాయి. అయినా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేది లేదని ఆయన మొండికేశారు. ఆ తరువాత ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సుధాకర్ దృష్టికి ఈ సమస్యను కళాశాలల యాజమాన్యాలు తీసుకువెళ్లాయి. అయన స్పందించి, పరీక్షల నిర్వహణ దిశగా అడుగులువేశారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో బాధిత విద్యార్థుల ప్రభావం ఉంటుందని భావించిన వైసీపీ ప్రభుత్వం.. పరీక్షలు నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించారు. వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ జీవీ రమణ అధ్యక్షతన సోమవారం ముఖ్య సమావేశాన్ని నిర్వహించి, ఒక కమిటీనీ ఏర్పాటు చేశారు. 1994-95 నుంచి 2014-15 బ్యాచ్‌ల విద్యార్థులకు సంవత్సర పరీక్షలు, 2015-16 నుంచి 2018-19 బ్యాచ్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేందుకు కమిటీ ఆమోదం తెలిపిందని వీసీ వెల్లడించారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీసీఏ, బీబీఎతోపాటు ఇతర కోర్సులలో సబ్జెక్టులు మిగిలిపోయిన వారందరికీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సంవత్సర పరీక్షల విద్యార్థులకు ఆఫ్‌లైన్, సెమిస్టర్ పరీక్షల విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. విద్యార్థులు తాము చదివిన కాలేజీలలోగాని, యూనివర్సిటీలోగాని దరఖాస్తులను అందజేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు. కమిటీ సభ్యులు రామగోపాల్, రామకృష్ణ, జయరామిరెడ్డి, సీఈ శ్రీరాములు నాయక్ సమావేశంలో పాల్గొన్నారు.



సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఆమోదాన్ని అందజేస్తున్న కమిటీ

పోక్సో కేసులో పదేళ్ల జైలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 29: పోక్సో కేసు ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ పోక్సో కేసుల స్పెషల్ కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు. అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడున్నరేళ్ల క్రితం ఓ బాలికపై అత్యాచారం జరిగింది. ఈ కేసులో ముద్దాయి షేక్ బాషా అలియాస్ ఆత్మకూరు బాషాకు శిక్ష పడింది. 2020 సెప్టెంబరు 18న జరిగిన ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ మురళీధర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. అన్ని కోణాల్లో కేసును విచారించిన న్యాయాధికారి.. ముద్దాయి నేరం చేసినట్లు నిర్ధారించారు. షేక్ బాషాకు శిక్ష, జరిమానా విధించారు. బాధితురాలికి రూ.2.50 లక్షల పరిహారం అందించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ విద్యాపతి వాదించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి, రూరల్ సీఐ రామక్రిష్ణారెడ్డి, కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ విశ్వనాథచౌదరి పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కోర్టు కానిస్టేబుళ్లు నాగార్జున, రజాక్, రాంమోహన్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచి, ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేశారు. వారిని ఎస్పీ అమిత్ బర్దర్ అభినందించారు.

హుబ్లీ ప్యాసింజరు పాక్షిక రద్దు



గుంతకల్లు, ఏప్రిల్ 29: నిర్వహణ పనుల కారణంగా హుబ్లీ-గుంతకల్లు-హుబ్లీ ప్యాసింజరు రైలును 30వ తేదీన పాక్షికంగా రద్దుపరిచామని రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హుబ్లీ-గుంతకల్లు-హుబ్లీ ప్యాసింజరు (07337/38) అప్ అండ్ డౌన్ రైలును మంగళవారం తోరణగల్లు-గుంతకల్లు సెక్షన్‌లో రద్దుపరచి, తోరణగల్లు-హుబ్లీ సెక్షన్‌లో నడవనున్నట్లు తెలియజేశారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు
జిల్లా స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ......
డోరు నెంబరు : ...... వీధి పేరు : ......
గ్రామం/పట్టణం : ...... మండలం : ......
జిల్లా : ...... పోస్టల్ పిన్‌కోడ్ : ...... ఫోన్ నెం. ......

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. అనంతపురం అర్బన్				
2. రాప్తాడు				
3. శింగనమల				
4. తాడిపత్రి				
5. గుంతకల్లు				
6. ఉరవకొండ				
7. కళ్యాణదుర్గం				
8. రాయదుర్గం				
9. ధర్మవరం				
10. కదిరి				
11. పుట్టపర్తి				
12. పెనుకొండ				
13. హిందూపురం				
14. మడకశిర				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి
ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 239-2ఎ, బెంగళూరు బైపాస్, కక్కలపల్లి క్రాస్, అనంతపురము- 515001.
షరతులు వర్తిస్తాయి

పాలకులారా.. పరిశ్రమలు ఏవీ..?

- సెజ్‌ల పేరిట వేల ఎకరాల సేకరణ
- ఏళ్లు గడిచినా ప్రారంభం కాని పరిశ్రమలు
- ఇప్పటికే మూతపడిన స్థానిక ఫ్యాక్టరీలు
- ఉపాధి కోసం వలస వెళ్తున్న ప్రజలు
- అభివృద్ధికి దూరంగా మడకశిర ప్రాంతం

మడకశిర

వెనుకబడిన మడకశిర ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పి, ఉపాధి కల్పించాలని ప్రభుత్వం భూములు సేకరించి ఏళ్లు గడుస్తున్నా ఒక్క ఫ్యాక్టరీ కూడా ఇక్కడ ప్రారంభం కాలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఉపాధి కోసం కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. స్థానికంగా నీటి వసతి లేకపోవడంతో వ్యవసాయం కూడా అంతంత మాత్రంగానే సాగుతోంది. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని సెజ్‌ల పేరుతో ప్రభుత్వం పదేళ్ల కిందట రైతుల నుంచి భూమి సేకరించింది. దీంతో సాగు చేస్తున్న భూమి పోవడం, పరిశ్రమలు నెలకొల్పకపోవడంతో రైతులు, కూలీలు ఉపాధి కోసం బెంగళూరు, మైసూరు, తెలంగాణ ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఈ వలసలు నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన పార్టీలు మడకశిర అభివృద్ధిని తమ మేనిఫెస్టోలో చేర్చి, ఆమేరకు అమలు చేయాలని కోరుతున్నారు.

మంత్రిమండలి ఆమోదం తెలిపినా ముందుకు పడని అడుగు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడాది కిందట జరిగిన మంత్రిమండలి సమావేశంలో మడకశిర మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ఆమోదించారు. కాని నేటికి ఎలాంటి ప్రక్రియ ప్రారంభం కాలేదు. మడకశిర మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు గతంలోనే వేల ఎకరాల భూములను సేకరించారు. అందుకు సంబంధించి పరిహారం చెల్లించారు. 2012లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటు ద్వారా పరిశ్రమలు నెలకొల్పడానికి భూములు సేకరించారు. మడకశిర మండలం గౌడనహళ్లి, ఆర్. అనంతపురం, చత్రం గ్రామాల పరిధిలో 1600 ఎకరాలు సేకరించారు. మడకశిర మండలం సి.కొడిగేపల్లి, కేతేపల్లి వద్ద 2006లో 1230 ఎకరాల భూమిని సేకరించారు. అయితే పరిశ్రమలు మాత్రం నెలకొల్పలేదు.


పదేళ్ల కిందట మూతపడిన ట్విస్టింగ్ యూనిట్

ఇంటికో ఉద్యోగం ఏదీ?

భూములు సేకరించేటప్పుడు పరిశ్రమలు నెలకొల్పి ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. కానీ నేటి వరకూ ఒక్క పరిశ్రమా రాలేదు. ఒక్కరికీ ఉపాధి దొరకలేదని స్థానికులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం చేస్తున్న భూములు కూడా పోవడంతో స్థానికంగా ఉపాధిలేక వలస వెళ్తున్నామని వా రు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప రిశ్రమలు నెలకొల్పక పోతే తమ భూములు వెనక్కు ఇవ్వాలని రైతులు డిమాండు చేస్తున్నారు.



పరిశ్రమల కోసం కేటాయించిన భూములు

ఉన్న పరిశ్రమలు మూత

మడకశిర ప్రాంతంలో ఉన్న అరకొర పరిశ్రమలు కూడా మూతపడటంతో చాలామంది ఉపాధి కరువై కర్ణాటక ప్రాంతానికి వలస వెళ్తున్నారు. మడకశిరలో ట్విస్టింగ్ యూనిట్, రీలింగ్ యూనిట్ ద్వారా ఉపాధి పొందేవారు. దాన్ని పదిహేనేళ్ల కిందట మూసి వేయడంతో చాలమందికి ఉపాధి కరువైంది. ట్విస్టింగ్ యునిట్‌లో పనిచేసినవారు ఆందోళన చేసినా ఫలితం లేకుండా పోయింది. మడకశిర మండలం నీలకంఠాపురంలో కన్య పరిశ్రమ ద్వారా 200నుంచి 300 దాకా ఉపాధి పొందేవారు. దాన్ని కూడా రెండేళ్ల కిందట మూసి వేశారు. హిందూపురం వద్ద ఏర్పాటు చేసిన గార్మెంట్స్ పరిశ్రమ రెండేళ్లయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఈ పరిశ్రమ ప్రారంభం అయితే వెయ్యి మందికి పైగా ఉపాధి లభిస్తుంది.

స్థానికంగా పనులు లేవు

మాకు స్థానికంగా ఎలాంటి పనులూ లేవు. దీంతో మాకు దగ్గరగా ఉన్న కర్ణాటక ప్రాంతానికి ఉపాధి కోసం వలస వెళ్లాల్సి వస్తోంది. వర్షాలు కురవకపోవడం, స్థానికంగా పనులు లేకపోవడంతో చాలా మంది బెంగళూరుకు పనులు నిమిత్తం వలస వెళ్తున్నారు. అక్కడ కూడా వెంటనే పనులు దొరకవు. పండుగలకు, ఇతర అత్యవసర పనులు పడినప్పుడు మాత్రమే సొంతూళ్లకు వస్తాం. స్థానికంగానే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తే మాకు ఈ బాధతలు తప్పుతాయి.

మారన్న , కొత్తపాళ్యం, రొళ్ల మండలం


నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని గార్మెంట్ పరిశ్రమ


కంకర తేలిన శీర్పి- విరుపాపల్లి రోడ్డు

అధ్వానంగా గ్రామీణ రహదారులు

బెళుగుప్ప, ఏప్రిల్ 29: వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శీర్పి నుంచి విరపాపల్లికి వెళ్లే రోడ్డు ఐదు కిలోమీటర్లు కంకర తేలి అధ్వానంగా ఉంది. కాలినడకన వెళ్లడానికి కూడా వీలు కాక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వెంకటాద్రిపల్లి, శీర్పి గ్రామాల ప్రజలు వ్యవసాయ తోటల్లోకి ద్విచక్ర వాహనాలలో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో మరింత దారుణంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ప్రయాణానికి ఇన్ని ఇబ్బందులు పడుతున్నా రోడ్ల బాగుకోసం గత ఐదేళ్లుగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శ్రీరంగాపురం నుంచి బూదివర్తికి వెళ్లే రోడ్డుకూడా గుంతలమయమై అధ్వానస్థితిలో ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తమకు కష్టాలు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ఐదేళ్లలో రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకపోవడం గమనార్హం.


పాడైపోయిన బూదివర్తి రోడ్డు

ఎన్నికల వేళ పోలీసులు అప్రమత్తం

- శింగనమల నియోజకవర్గంలో ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలపై నిఘా
- రౌడీషీటర్ల బైండోవర్
- పుట్లూరు, యల్లనూరు మండలాలపై ప్రత్యేక దృష్టి

బుక్కరాయసముద్రం



ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. శింగనమల నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమంటే అధికారులకు కత్తిమీద సామే. ఫ్యాక్షనిజం, ఆధిపత్య పోరు కల్గి ఉన్న గ్రామాలు అధికంగా ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో ఎన్నికలు పోలీసులకు సవాలుగానే చెప్పాలి. రెండు పార్టీలకు గెలుపే ధ్యేయంగా భావిస్తుండటంతో వాతావరణం వేడెక్కింది. దీంతో పోలీసులు, ఎన్నికల విభాగం అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీసు అధికారులు సమస్యాత్మక గ్రామాలపై డేగకన్ను పెట్టారు. 1994, 1999, 2004, 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రీపోలింగ్, రిగ్గింగ్, రీ సైక్లింగ్, ఇరువర్గాలు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల సమయంలో గొడవలు, ఇతర సంఘటనల ఆధారంగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు.

సమస్యాత్మక గ్రామాల్లో జల్లెడ



ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సమస్యాత్మక గ్రామాలను పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఎన్నికల సందర్భంగా తొలుత ఆరు మండలాల్లోని రౌడీషీటర్లను బైండోవర్ చేసి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో రాజకీయ నేతలపై నేర చరిత్ర కల్గిన కేసులు ఉంటే బైండోవర్ చేయాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఎలాంటి కేసులు లేని నేతలపై బైండోవర్ చేసేందుకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు లేవని పోలీసులు చెబుతున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఫ్లాగ్ మార్చ్, నాకాబందీ నిర్వహిస్తున్నారు. అనుమానపు వ్యక్తులు, ఫ్యాక్షన్ నేతల ఇళ్లలో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు.

పుట్లూరు, యల్లనూరు మండలాలపై ప్రత్యేక నిఘా



శింగనమల నియోజకవర్గంలోనే ప్రత్యేకమైన పుట్లూరు, శింగనమల మండలాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. సమస్యాత్మక కేంద్రాల్లో ఎన్నికలు సవ్యంగా సాగాలంటే అన్ని విభాగాల అధికారులు సమగ్ర అధ్యయనం చేసి సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పలుచోట్ల వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. గతంలో పలు గ్రామాల్లో రీసైక్లింగ్, రిగ్గింగ్ జరిగిన ఘటనలు అనేకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బైండోవర్, సమస్యాత్మక గ్రామాలు ఇవే..

నియోజకవర్గంలో అత్యంత సమస్యాత్మక మండలంగా యల్లనూరును గుర్తించారు. ఈ మండలంలో 15 గ్రామాలను గుర్తించి ఇరు పార్టీలకు చెందిన 469 నేతలు, కార్యకర్తలు ముందస్తుగా బైండోవర్ చేశారు. కల్లూరు, వెన్నపూసపల్లి, తిమ్మంపల్లి, యల్లనూరు, మేడకుర్తి, అచ్యుతాపురం, దంతాలపల్లి, నిడిజంపల్లి, కూచివారిపల్లి, చింతకాయమందా, సింగవరం, వేములపల్లి, గడ్డంవారి వెంకటంపల్లిని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు బుక్కరాయసముద్రం మండలంలో 9 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 410 మందిని బైండోవర్ చేశారు. చెన్నంపల్లి, వడియంపేట, కేకే ఆగ్రహారం, నీలంపల్లి, రేగడికొత్తూరు, బి. కొత్తపల్లి, జంతులూరు, వెంకటాపురం, బొమ్మలాటపల్లి గ్రామాలను పోలీసులు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. మండల వ్యాప్తంగా పలువురు వైసీపీ, టీడీపీ, సీపీఐకి చెందిన మద్దతుదారులు, రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. గార్లదిన్నె మండలంలో ఆరు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 600 మందిని బైండోవర్ చేశారు. ఈ మండలంలో గార్లదిన్నె, మర్తాడు, పెనకచెర్ల, కేశవాపురం, ఇల్లూరు, కల్లూరు గ్రామాలను అత్యంత సమస్యాత్మకంగా తేల్చారు. శింగనమల మండలంలో ఏడు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 306 మందిని బైండోవర్ చేశారు. నిదనవాడ, సి.బండమీదపల్లి, ఉలికల్లు, సలకంచెరువు, కల్లుమడి తరిమెలను అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. ఇప్పటి వరకు మండలంలో టీడీపీ, వైసీపీ, సీపీఐకి చెందిన 306 మందిని బైండోవర్ చేపట్టారు. పుట్లూరు మండలంలో ఏడు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 470 మందిని బైండోవర్ చేయించారు. ఈ మండలంలో ఏడు గ్రామాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటిలో మడుగుపల్లి, చాలవేముల, మడ్డిపల్లి, కోమటికుంట్ల, కుమ్మనమల, అరకటవేముల, గరుగుచింతలపల్లి ఉన్నాయి. ఇప్పటి వరకు 470 మందిని బైండోవర్ చేపట్టారు. నార్పల మండలంలో ఏడు గ్రామాలు అత్యంత సమస్యాత్మకమైనవి ఉండగా 507 మందిని బైండోవర్ చేయించారు. ఈ మండలంలో నార్పల, బండ్లపల్లి, కర్ణపుడికి, గడ్డంనాగేపల్లి, వెంకటంపల్లి, నడిమిదొడ్డి, పులుసులనూతల గ్రామాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించి ఇప్పటి వరకు 507 మంది బైండోవర్ చేశారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



శింగనమల నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. ఎన్నికలకు విఘాతం కల్గించే వారిపై నిఘా పెంచాం. గ్రామాల్లో పర్యటించి ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా విధించాం.

- బి.వీరశివారెడ్డి, డీఎస్పీ, అనంతపురం రూరల్


చెన్నంపల్లిలో పోలీసుల కౌన్సెలింగ్ (ఫైల్)

ఏర్పాట్లకు నిధులేవీ..?

- పోలింగ్ స్టేషన్లపై చేతులెత్తేశారు
- ఒక్క రూపాయీ ఇవ్వని అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 2,236 పోలింగ్ స్టేషన్లు
- ఏర్పాట్లు చేయాలంటూ సెక్టార్ ఆఫీసర్లపై ఒత్తిడి
- నాడు-నేడు, ఎస్ఎంఎఫ్ నిధులు వాడుకోవాలని సలహా
- ఓటర్లకు తిప్పలు తప్పవా..?



అనంతపురం విద్య, ఏప్రిల్ 29 : ఎన్నికల సమయం సమీపిస్తోంది. పోలింగ్ తేదీ రాగానే అందరికీ గుర్తొచ్చేవి పోలింగ్ స్టేషన్లు. పోలింగ్ స్టేషన్లలో కనీస సదుపాయాలు కల్పించాలి. గతంలో పోలింగ్ కేంద్రాల్లో తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు చేసేవారు. దీంతో సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించి పోలింగ్ నాటికి అన్నీ సిద్ధం చేసేవారు. ఇప్పుడు కూడా పనులు చేయండి అంటూ ఆదేశిస్తున్నారు కానీ.. ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వడం లేదు. జిల్లాలోని సెక్టార్ ఆఫీసర్లకు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన బాధ్యతలు అప్పగించారు. చిల్లిగవ్వ ఇవ్వకుండా ఏర్పాట్లు ఎలా అంటూ వారు మింగలేక, కక్కలేక, ఎవరికి చెప్పకోవాలో తెలియక నలిగిపోతున్నారు. పాఠశాలలకు నాడు-నేడు మిగిలిన డబ్బులు, స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్స్(ఎస్ఎంఎఫ్)తో మరమ్మతులు, ఇతర సదుపాయాల కల్పించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు.

కేంద్రాల్లో ఏర్పాట్లు ఎలా...?

జిల్లా వ్యాప్తంగా 2,236 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో విడుదల చేసిన గెజిట్‌లో అనంతపురం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలు కలిపి 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2,236 కేంద్రాలు ఉన్నాయి. చాలా పోలింగ్ కేంద్రాలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నాయి.



కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, లైటింగ్‌తో పాటు, మరుగుదొడ్లు, తాగునీరు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న ఓటర్ల సౌకర్యార్థం ర్యాంపులు ఏర్పాటు చేయాలి. గత ఎన్నికల్లో గొడవలు, అల్లర్ల వల్ల సమస్యాత్మకంగా ఉంటే...ఆ పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బాధ్యతలను సెక్టార్ అధికారులకు అప్పగించారు. ఈ ఏర్పాట్లకు డబ్బులెలా అని సెక్టార్ ఆఫీసర్లు సతమతమవుతున్నారు.

డబ్బుల్లేక అధికారుల గగ్గోలు

జిల్లాలో 2,236 పోలింగ్ కేంద్రాలుంటే....241 సెక్టార్లుగా విభజించారు. ఒక్కో సెక్టార్‌కు ఒక్కో అధికారి చొప్పున 241 మందితోపాటు అదనంగా 22 మంది (రిజర్వు)ని నియమించారు. వందలాది కేంద్రాల్లో సమస్యలు ఉన్నాయి. ర్యాంపులు, మరుగుదొడ్లు , ఫ్యాన్లు, బారికేడ్లు వంటివి ఏర్పాటు చేయాలంటే..వేలాది రూపాయలు ఖర్చవుతుంది. అప్పటికే ఉన్న మెట్లపై ర్యాంపు ఏర్పాటు చేయాలన్నా.. కొత్తగా మెట్లు పెట్టించి ర్యాంపు ఏర్పాటు చేయించాలన్నా...రమారమి రూ. 4 వేల నుంచి రూ. 6 వేల వరకూ వ్యయమవుతుందని సెక్టార్ ఆఫీసర్లు వాపోతున్నారు. మరుగుదొడ్లు, ఫ్యాన్లు, బారికేడ్ల ఏర్పాటుకు సైతం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిందే. ఇప్పటి వరకూ సెక్టార్ అధికారులకు ఉన్నతాధికారులు డబ్బులు ఇవ్వలేదు. స్కూళ్ల ఆవరణలో ఉన్న పోలింగ్ స్టేషన్లలో ఏవైనా సదుపాయాలు చేయాలంటే.... నాడు-నేడు పనులు జరుగుతున్న స్కూళ్లలో నిధులు మిగిలి ఉంటే..వాటిని సర్దుబాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు చెబుతున్నారని తెలిసింది. నాడు-నేడు పనులు జరగని పాఠశాలలు ఉన్న పోలింగ్ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఈ సదుపాయాలు చేయాలంటే ఎలాగని తలలు పట్టుకుంటున్నారు. వివిధ శాఖ అధికారులను సెక్టార్ ఆఫీసర్లుగా వేశారు. వాళ్లకు కేటాయించిన పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి అవి ఏ శాఖ పరిధిలోకి వస్తున్నాయో కనుక్కుని, ఆ శాఖల అధికారుల వద్దకు వెళ్లి ఈ ఏర్పాట్లు చేయాలంటే ఎలా అంటూ గగ్గోలు పెడుతున్నారు. దీంతో అటు సెక్టార్ ఆఫీసర్లు, ఇటు సంబంధిత అధికారులు డబ్బుల్లేక బిక్కమొహాలేసి చూసుకునే దుస్థితి నెలకొంది.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	రూట్లు	సెక్టార్లు	సెక్టార్ ఆఫీసర్లు
రాయదుర్గం	296	32	32	34
ఉరవకొండ	263	32	32	37
గుంతకల్లు	276	29	29	31
తాడిపత్రి	274	29	29	32
శింగనమల	293	30	30	32
అనంతపురం అర్బన్	292	30	30	34
కళ్యాణదుర్గం	261	25	25	27
రాప్తాడు	281	34	34	36
మొత్తం	2,236	241	241	263

తక్కువ సమయంలో పనులు సాధ్యమేనా..?

నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. వచ్చే నెల 13వ తేదీనే పోలింగ్. 12వ తేదీ నుంచే ఆ కేంద్రాలు అధికారుల చేతుల్లోకి వెళ్లిపోతాయి. అంటే 11వ తేదీ నాటికి అక్కడ ఏర్పాట్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు కావాల్సిందల్లా డబ్బు. గతంలో నిధులు కేటాయించి పనులు చేయమని చెప్పేవారు. ఈ దఫా మాత్రం చిల్లి గవ్వ ఇవ్వకుండా పనులు చేయాలని ఆదేశాలిస్తే తాము ఏమి చేయాలని సెక్టార్ ఆఫీసర్లు వాపోతున్నారు.


అనంతపురం రూరల్‌లోని పాఠశాలలో పోలింగ్ బూత్‌లు

ఓటేసేకి ఊరికి రాండన్నో..



హలో.. నమస్తే అన్నా, నమస్తే అక్క బాగున్నారా? యా ఊర్లో ఉండారు? ఎలచ్చన్లు వచ్చే నెల 13న ఉండాయి. మీ అందరూ తప్పకుండా ఊరికి రావల్ల. ఇండి ఆడ మనూరోళ్లు ఎంతమంది ఉండారు. వాళ్ల ఫోన్ నంబర్లు కూడా ఇయ్యండి. వాళ్లని రమ్మని సెబుతాం. మీరు రొండు దినాలు ముందే రాండన్నా. ఆడ మనోళ్లు ఎంతమంది ఉండారో కచ్చితంగా సెబితే వచ్చి పొయ్యేదానికి శార్జీలకు దుడ్ల ఫోన్‌పేలో చేస్తాం. ఇలా గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ప్రజలను స్థానిక నాయకులు ఫోన్ చేసి అడుగుతున్నారు. మండలం నుంచి బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి వంటి ప్రాంతాలకు అనేకమంది వలస వెళ్లారు. ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కావడంతో వారిని ఓటింగ్‌కు రప్పించేందుకు ఆయా గ్రామాల నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలో రానుపోను చార్జీలు భరించడంతో పాటు ఓటుకు ఇంత అని ముట్టచెప్పడానికి సైతం అభ్యర్థుల అనుచరులు వెనుకాడటం లేదు. ఓటరు జాబితా తీసుకుని వలస ఓటర్ల పేర్లు, సీరియల్ నెంబర్, బూత్ నెంబర్ వారిగా మరో జాబితాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

- ముదిగుబ్బ

సమస్యలు ఇస్త్రీ చేసేస్తా


రాయదుర్గం 24వ వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఓ రజకుడిని ఓటు అభ్యర్థిస్తూ దుస్తులు ఇస్త్రీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు


పల్లె సింధూరరెడ్డిని దీవిస్తున్న వృద్ధురాలు

బిడ్డా.. మా ఓట్లన్నీ నీకే..!

ఎండనపడి తిరుగుతూ ఎంత కష్టపడుతున్నావు తల్లీ.! మా ఓట్లన్నీ తప్పకుండా నీకే వేస్తాం. బిడ్డా..! నువ్వు సల్లగుండాలి అంటూ ఎన్నికల ప్రచారంలో ఉన్న పల్లె సింధూరారెడ్డిని ఓ వృద్ధురాలు ఆశీర్వదించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సింధూరారెడ్డి అమడగూరులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఓవృద్ధురాలు పల్లె సింధూరను దగ్గరకు పిలిచి తలపై పూలు వేసి నీవు చల్లగా ఉండాలంటూ ఆశీర్వదించారు.

- పుట్టపర్తి

చిరు వ్యాపారులకు ఒరిగిందేమీ లేదు



వెంటేశ్ గుప్తా, చిరు వ్యాపారి

వైసీపీ పాలనలో చిరువ్యాపారులకు ఒరిగిందేమీ లేదు. గత ఎన్నికల సమయంలో జగన్ ఒక్క చాన్స్ అంటే ఇచ్చాం. గెలిచాక మమ్మల్ని పట్టించుకున్నదేలేదు. చిన్న వ్యాపారులో కొంత మందికి మాత్రమే రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపు కున్నారు. ఈరోజుల్లో ఆ మొత్తం దేనికి సరిపోతుంది. మేము కూడా చిన్న వ్యాపారులకు ఆర్థిక సాయం అందించాం అని వైసీపీ నాయకులు చెప్పుకోవడానికి మాత్రమే సరిపోతుంది.

- మడకశిర రూరల్

కొత్త పథకాలు ఏవీ..?



నారాయణనాయక్, నిరుద్యోగి

వైసీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను పరిశీలిస్తే అందులో కొత్తపథకాలు లేవు. పాతవాటినే తిరగరాసి, నవరత్నాలు ప్లస్ అంటున్నారు. గతంలో హామీ ఇచ్చిన సీపీఎస్ రద్దు, మద్య పాన నిషేధం చేయలేదు. వైసీపీ మేనిఫెస్టోను చూసి, ఆపార్టీ కార్యకర్తలే ఉసూరుమంటున్నారు. ఉపాధి, ఉద్యోగ కల్పనలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

- కదిరి అర్బన్

ఎంత బరితెగింపూ.. రాజీనామా చేయాలట..!

వలంటీర్లకు 'విశ్వ' ఆదేశాలు

విడపనకల్లు, ఏప్రిల్ 29: వలంటీర్లు రాజీనామా చేసి వైసీపీ విజయానికి కృషి చేయాలని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వై విశ్వేశ్వరరెడ్డి ఆదేశించినట్లు సమాచారం. ఉరవకొండలోని వైసీపీ కార్యాలయంలో విడపనకల్లు మండలానికి చెందిన 19 గ్రామాల వలంటీర్లతో సోమవారం రాజకీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వలంటీర్లలో ఇంకా ఎవరైనా రాజీనామా చేయని వారు ఉంటే ఖచ్చితంగా చేయాలని, మీ భవిష్యత్తుకు నాది గ్యారెంటీ అని అభయం ఇచ్చినట్లు సమాచారం. అందరూ కష్టపడి వైసీపీని గెలిపించాలని సూచించినట్లు తెలిసింది. ఐదు రోజుల్లో గ్రామాల వారిగా టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, న్యూట్రల్ ఓటర్లను గుర్తించాలని, టీడీపీ ఓటర్లను తప్ప మిగిలిన అందరిని తమ వైపు తిప్పుకునేలా ప్రచారం నిర్వహించాలని వలంటీర్లకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే జగన్ ఇస్తున్న పథకాలు అన్ని మీకు రాకుండా పోతాయని బెదిరించే విధంగా ప్రచారం ఉండాలని సూచించినట్లు తెలిసింది.

1909లోనే భారతీయులకు ఓటు హక్కు



కదిరి అర్బన్, ఏప్రిల్ 29: దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌వారిపై భారతీయులు సాగించిన పోరాటంలో ఓటుహక్కు ఉద్యమం ఒకటి. నాటి పాలనలో అంతర్భాగమైన స్థానిక సంస్థలకు 1907లో నిర్వహించిన ఎన్నికల్లో భారతీయులకు ఓటు హక్కు కల్పించాలని ఉద్యమం సాగించారు. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం రాయల్ కమిషన్ ఏర్పాటు చేసింది. దాని సిఫార్సుల ఫలితంగా 1909లో జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో కౌన్సిల్ చట్టం ప్రకారం కొద్దిమంది భారతీయులకు ఓటు హక్కు కల్పించారు. అప్పటినుంచి కొనసాగిన ఉద్యమాలతో 1935లో ఓటు హక్కును విస్తృతం చేస్తూ భారతీయుల ఓటు హక్కు శాతాన్ని 10.6శాతానికి పెంచారు. అనంతరం జరిగిన రాజ్యాంగపరిషత్ ఎన్నికల నాటికి 28.5 శాతం ప్రజలకు ఓటు హక్కు వచ్చింది. 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించాక ప్రజాస్వామ్య విధానానికి కట్టుబడి భారత రాజ్యాంగం 326 అధికారణ ప్రకారం 21సంవత్సరాలు నిండిన భారతీయ పౌరులకు ఓటు హక్కు అమలు చేశారు. 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఓటు హక్కు వయోపరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది.

ఇప్పుడు గుర్తొచ్చిందా..?

హడావుడిగా ధర్మవరం-మేడాపురం రోడ్డు పనులు

అంతా ఓట్ల కోసమేనని విమర్శలు



ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం


చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 29: పోలింగ్‌కు పద్నాలుగు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో వైసీపీ నాయకులు హడావుడిగా రోడ్డు పనులు ప్రారంభించారు. ధర్మవరం ఎర్రగుంట సమీపంలోని రైల్వేవంతెన నుంచి మేడాపురం వెళ్లే రోడ్డు నిర్మాణం పనులను చేపట్టారు. దాదాపు వారం రోజులుగా పనులు సాగుతున్నాయి. దీంతో ఆ రోడ్డువెంట రోజు రాకపోకలు సాగిస్తున్నవారు ఎన్నికలు వచ్చినాయి కాబట్టే ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి ఈ రోడ్డు గుర్తుకువచ్చింది. లేకపోతే ఇన్నేళ్లుగా రోడ్డు బాగాలేక ఇబ్బందులుపడుతున్నా పట్టించుకోలేదు. ఓట్ల కోసమే పనులు చేస్తున్నాడని బాహాటంగానే సెటైర్లు వేస్తున్నారు.

ఎన్నికల కోడ్ వర్తించదా..?

ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రోడ్డు పనులు చేపట్టడమేమిటని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ రాకముందే రోడ్డు మంజూరై ఉంటే ఇప్పుడు హడావుడిగా పనులు చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. అధికార దర్పంతో వైసీపీ నాయకులు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పొంతనలేని పీఐయూ ఇంజనీరింగ్ అధికారుల వివరణ

ఈ రోడ్డు పనులపై పీఐయూ ఇంజనీరింగ్ అధికారులను విలేకరులు ఫోన్‌లో వేర్వేరుగా వివరణ కోరగా వారి నుంచి పొంతనలేని సమాధానం వచ్చింది. ముందుగా జేఈ నారాయణస్వామితో మాట్లాడగా రూ.30లక్షల జడ్పీ నిధులతో వర్క్‌ఆర్డర్ తీసుకుని పనులు చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ కన్నా ముందే మంజూరు ఉత్తర్వులు ఉన్నాయా అనేదానిపై సమాధానం దాటవేస్తూ నేను ఇంతకన్నా ఎక్కువ చెప్పలేను అని ఆయన పేర్కొన్నారు. అనంతరం డీఈ రామచంద్రారెడ్డిని వివరణ కోరగా మార్చి 15న ఎమ్మెల్యే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారన్నారు. రూ.20లక్షలతో కిలో మీటరున్నర రోడ్డు పనులు చేయాల్సి ఉండగా కాంట్రాక్టరు వల్ల పనులు ఆలస్యం జరిగిందన్నారు. అందుకే ఇప్పుడు మొదలుపెట్టారన్నారు.



ఉరవకొండ ముఖచిత్రం



స్వాతంత్ర్యానికి పూర్వమే పంచాయతీ బోర్డుగా ఏర్పడిన ఉరవకొండ నానాటికి విస్తరించింది. రాష్ట్రంలోనే అతిపెద్ద మేజర్ పంచాయతీగా గుర్తింపు పొందింది. ఒక కొండ చుట్టూ ఊరు విస్తరించడం దీని ప్రత్యేకత. పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం జిల్లాలోనే ప్రసిద్ధి చెందినది. రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయం బూదగవి గ్రామంలో ఉంది. ఉరవకొండ నియోజకవర్గంలో ఎక్కువ భాగం వ్యవసాయమే జీవనాధారం. సాగు, తాగునీటి సమస్యలు నెలకొన్నాయి.

విలక్షణం..ఉరగాద్రి

స్వాతంత్ర్యానికి ముందే పంచాయతీ బోర్డు

అంచెలంచెలుగా అభివృద్ధి చెందిన ఉరవకొండ

పెన్నహోబిలం అభివృద్ధి పట్టని పాలకులు

వెంటాడుతున్న సాగు, తాగునీటి సమస్య

ఉరవకొండ



నియోజకవర్గ చరిత్ర

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే వైశాల్యం రీత్యా ఉరవకొండ మూడోది. గతంలో ఉరవకొండను ఉరగాద్రి అనే పేరుతో పిలిచేవారు. ఊరు మధ్యలో ఉన్న కొండ పాము పడగ ఆకారంలో ఉండటంతో ఈ పేరుతో పిలుస్తున్నట్లు తెలుస్తోంది. సంస్కృతంలో ఉర అంటే పాము పడగ అని, ఆద్రి కొండ అని అర్థం. పాము పడగ వలె ఉన్న కొండ కాబట్టి ఉరగాద్రిగా పిలిచేవారు. తర్వాతి కాలంలో ఉరవకొండగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఉరవకొండ పట్టణం కొండ చుట్టూ అభివృద్ధి చెందుతూ పోవడం విశేషంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్యం సిద్ధించేందుకు ఆరు దశాబ్దాల ముందుగానే ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన పంచాయతీల్లో ఇదీ ఒక్కటి. 19 శతాబ్దంలోనే పంచాయతీ బోర్డుగా ఏర్పడింది. ప్రస్తుతం పట్టణంలో 45వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. రాష్ట్రంలో అతిపెద్ద మేజర్ పంచాయతీ. ప్రస్తుత నియోజకవర్గంలో మొత్తం 2,22,723 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,09,905, స్త్రీలు 1,12,788, ట్రాన్స్ జెండర్స్ 30 మంది ఉన్నారు. 259 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 1978లో కాంగ్రెస్ (ఐ) పార్టీకి చెందిన రాయల వేమన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన వెంకటనారాయణపై 19,987 ఓట్ల అత్యధి మెజారిటీతో గెలుపొందారు. 2009 టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ కాంగ్రెస్ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డిపై 229 ఓట్ల అత్యల్ప మెజార్టీ సాధించారు. 2009కి ముందు ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాలు మాత్రమే నియోజకవర్గంలో ఉండేవి. గుంతకల్లు మండలంలోని నాగసముద్రం, ఇమాంపురం, కదిరిపల్లి, గుర్రబ్బాడు, అయ్యవారిపల్లి, వెంకటాంపల్లి గ్రామాలు, పామిడి, కణేకల్లు మండలాల లోని పలు గ్రామాలు కలసి నియోజకవర్గంగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, కూడేరు, బెళుగుప్ప మండలాలు ఉన్నాయి.

తొలి ఎమ్మెల్యే చిన్న వెంకన్న

తొలిసారి 1962లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన గుర్రం చిన్నవెంకన్న కాంగ్రెస్ అభ్యర్థి దరూరు పుల్లయ్యపై గెలుపొందారు. ఆయన స్వస్థలం ఉరవకొండ. వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తి. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, పంచాయతీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1967లో రెండోసారి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి కేబినేట్‌లో చిన్న పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు.



ఉరవకొండ నియోజకవర్గ చరిత్ర

ఉరవకొండ నియోజక వర్గం 1962 ఏర్పడింది. అంతకు మునుపు గుత్తి అసెంబ్లీలో ఉరవకొండ ఉండేది. నియోజకవర్గం ఆవిర్భావం తర్వాత 13 సార్లు ఎన్నికలు జరిగాయి. 1962, 1972 ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులు విజయం సాధించారు. తర్వాత నాలుగు సార్లు 1967, 1978, 1989, 1999లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. ఏడుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలిచారు. 1983, 1985, 1994, 2004, 2009, 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందగా, 2014లో వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు.

సంవత్సరం	ఎమ్మెల్యే	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1962	గుర్రం చిన్నవెంకన్న	ఇండిపెండెంట్	దరూరు పుల్లయ్య	కాంగ్రెస్	4,730
1967	గుర్రం చిన్నవెంకన్న	కాంగ్రెస్	ఎస్. శివరామిరెడ్డి	ఇండిపెండెంట్	5,391
1972	బుక్కిట్ల బసప్ప	ఇండిపెండెంట్	వేమన్న	కాంగ్రెస్	2,163
1978	ఆర్.వేమన్న	కాంగ్రెస్ (ఐ)	పి.వెంకటనారాయణ	కాంగ్రెస్	19,986
1983	భీమిరెడ్డి	ఇండిపెండెంట్	రాయల వేమన్న	కాంగ్రెస్	15,078
1985	గుర్రం నారాయణప్ప	టీడీపీ	గోపీనాథ్	కాంగ్రెస్	9,376
1989	గోపీనాథ్	కాంగ్రెస్	గుర్రం నారాయణప్ప	టీడీపీ	16642
1994	పయ్యావుల కేశవ్	టీడీపీ	శివరామిరెడ్డి	ఇండిపెండెంట్	17,691
1999	వై.శివరామిరెడ్డి	కాంగ్రెస్	పయ్యావుల కేశవ్	టీడీపీ	8,501
2004	పయ్యావుల కేశవ్	టీడీపీ	వై.విశ్వేశ్వరరెడ్డి	సీపీఎం	8,255
2009	పయ్యావుల కేశవ్	టీడీపీ	వై.విశ్వేశ్వరరెడ్డి	కాంగ్రెస్	229
2014	వై.విశ్వేశ్వరరెడ్డి	వైసీపీ	పయ్యావుల కేశవ్	టీడీపీ	2,275
2019	పయ్యావుల కేశవ్	టీడీపీ	వై.విశ్వేశ్వరరెడ్డి	వైసీపీ	2,132

ప్రముఖ ప్రదేశాలు

ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఆలయం. రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయం బూదగవి గ్రామంలో ఉంది. వజ్రకరూరు మండలంలో జరుట్ల రాంపురంలో దక్షిణకాశీగా పిలుస్తున్న జరుట్ల రామలింగేశ్వస్వామి దేవాలయం, కూడేరు జోడు లింగాల సంగమేశ్వరాలయం, విడపనకల్లు మండలంలో ఉండబండ వీరభద్రస్వామి దేవాలయం ప్రముఖమైనవి. పెన్నహోబిలంలోని హెచ్చెల్సీ కాలువ జలపాతం పర్యాటక కేంద్రంగా చెప్పుకోవచ్చు.



రెండుసార్లు మంత్రి పదవులు

ఉరవకొండ నియోజకవర్గంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో రెండుసార్లు మంత్రి పదవులు దక్కాయి. 1967లో గుర్రం చిన్నవెంకన్న ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి కేబినేట్‌లో చిన్న పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున గుర్రం నారాయణప్ప గెలుపొందారు. ఎన్టీఆర్ హయాంలో ఆయన పౌరసరఫరాలు, కరువు శాఖల మంత్రిగా పనిచేశారు.

ప్రధాన సమస్యలు

- ఉరవకొండలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. 10 రోజులకు ఒక్కసారి నీటిని వదులుతున్నారు. పలు గ్రామాల్లో వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు.
- ఉరవకొండలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 44 లక్షలతో చేపట్టిన షాదీఖానా నిర్మాణం పనులు నిలిచిపోయాయి. నిధుల కొరతతో ఈ పనులు నాలుగేళ్లుగా ముందుకు సాగలేదు.
- పాల్తూరు - కరకముక్కల, ఆర్.కొట్టాల - డొనేకల్లు వేళ్లే రహదారి పనులు ప్రారంభించి కంకరవేసి వదిలేశారు. ఉరవకొండ -ఇంద్రావతి, ధర్మపురి - చాబాల , చీకలగుర్కి- ఉరవకొండ, విరుపాయపల్లి - శీర్పి గ్రామాలకు వెళ్లే హదారులు అధ్వానంగా ఉన్నాయి.
- నియోజకవర్గంలో 80వేల ఎకరాలకు సాగు నీరు అందించే డిస్ట్రిబ్యూటరీ పనులు ఆగిపోయాయి.
- హంద్రీనీవా నుంచి షేక్షానుపల్లి, లత్తవరం, రాచర్ల చెరువులకు నీరు వదలక పోవడంతో సాగు, తాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.
- నియోజకవర్గంలో 50వేల ఎకరాలకు సాగు నీరు అందించే రూ. 870కోట్ల మెగా డ్రిప్ ప్రాజెక్టు మూలన పడింది.
- పీఏబీఆర్ డిస్ట్రిబ్యూటరీ హెడ్ కూలిపోయి మూడేళ్లైనా నిర్మాణం చేపట్టలేదు. కాలువ కూడా అధ్వానంగా తయారైంది. సిమెంట్ పెచ్చు లూడిపోయాయి. కాలువలో పిచ్చి మొక్కలు పెరిగి నీరు పారేది ప్రశ్నార్థకంగా మారింది. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ఆగిపోయాయి. కాలువ గట్లు భారీగా కోతకు గురయ్యాయి.
- రాకెట్ల, ఆమిద్యాల లిఫ్ట్ ద్వారా 10వేల ఎకరాలకు సాగునీరు అందించే పథకానికి భూమి పూజ చేసినా పనులు ప్రారంభించలేదు.
- ఇప్పేరు చెరువు మూడేళ్లుగా అడుగంటి పోయింది. జీడీపల్లి రిజర్వాయర్ దిగువ భాగాన గ్రామం ఉండటంతో ఊటనీరు గ్రామంలోకి ప్రవేశిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఆర్అండ్ఆర్ కింద రూ. 55 కోట్లు మంజూరు చేశారు. సర్వేలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేశారు. ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. అధికారంలోకి వస్తే మూడు నెలల్లోనే సమస్య పరిష్కరిస్తామని వైసీపీ నేతలు హామీ ఇచ్చి ఏళ్లు గడిచినా నేటికీ నెరవేరలేదు.
- జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెన్నహోబిలం పర్యాటక రంగం అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. గతంలో పెన్నహోబిలం, పీఏబీఆర్, ఎంపీఆర్ ప్రాంతాలను పర్యాటక రంగం అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలు చేశారు. అవి అమలుకు నోచుకోలేదు. పెన్నహోబిలం వద్ద హెచ్చెల్సీ నీటిని వదిలే సమయంలో జలపాతం చూపరులను ఆకట్టుకుంటుంది. ఆ ప్రాంత అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

ఓటరు తీర్పు విలక్షణం

ఉరవకొండ నియోజకవర్గంలో గత 20 ఏళ్ల నుంచి ఓటర్ల తీర్పు విలక్షణంగా ఉంటోంది. నియోజకవర్గంలో గెలిచిన అభ్యర్థి పార్టీకి విరుద్ధంగా రాష్ట్రంలో అధికారం మరోపార్టీది ఉంటుంది. గత 20 ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. నియోజకవర్గం ప్రధానంగా వ్యవసాయ రంగం మీదే ఆధారపడి ఉంది. సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తి కాకపోవడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉరవకొండ చేనేత రంగంపైన ఆధారపడి ఉంది. చేనేత రంగంపై ఆధారపడిన కార్మికులు



పెన్నహోబిలం దేవస్థానం

ప్రస్తుత ఓటర్ల సంఖ్య

మండలం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
విడపనకల్లు	21,713	21,661	8	43,382
వజ్రకరూరు	21,561	21,738	6	43,305
ఉరవకొండ	32,793	34,838	9	67,640
బెళుగుప్ప	17,829	18,282	-	36,111
కూడేరు	16,009	16,269	7	32,285
మొత్తం	1,09,905	1,12,788	30	2,22,723



ఉరవకొండ పట్టణ ఓటర్లే కీలకం

ఉరవకొండ నియోజకవర్గంలో అత్యధికంగా వాల్మీకులు ఉన్నారు. తర్వాత కురుబ, ముస్లిం, చేనేత, కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఐదు మండలాల తీర్పు ఎలా ఉన్నా పట్టణ ఓటర్ల తీర్పే కీలకం. వీరిలో చేనేత, ముస్లిం ఓటర్లే అభ్యర్థుల గెలుపోటముల ప్రభావితం చేస్తున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ ఉరవకొండ పట్టణంలో వచ్చినటు మెజార్టీతోనే అభ్యర్థులు గెలిచారు. దీంతో ప్రధాన పార్టీలు ఉరవకొండపైనే దృష్టి సారించాయి.

ఐదోసారి ప్రత్యర్థులుగా కేశవ్, విశ్వ

ఆ నియోజకవర్గంలో తెలుగుదేశం నుంచి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఈ ఎన్నికల్లో తలపడుతున్నారు. పాత ప్రత్యర్థులిద్దరూ ఐదోసారి పోటీ పడుతున్నారు. అలాగే ఈసారి వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. దీంతో ఉరవకొండలో త్రిముఖ పోటీ నెలకొంది. అన్నదమ్ములిద్దరూ వేర్వేరు పార్టీల నుంచి పోటీ పడుతుండడంతో వీరి పోరు ఎవరికి కలిసి వస్తుందోనన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వైసీపీ ఓట్లు చీల్చుతారేమోనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఓట్ల చీలిక టీడీపీకి లాభిస్తుందన్న చర్చ నడుస్తోంది.

చేయి చేయి కలిపి..

రోడ్డు మరమ్మతులు చేసుకుంటున్న గడేకల్లు గ్రామస్థులు

విడపనకల్లు, ఏప్రిల్ 29: అందరికీ చెప్పి, చెప్పి విసిగిపోయిన పలువురు యువకులు రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టిన ఘటన మండలంలోని గడేకల్లు గ్రామంలో జరిగింది. గతంలో ఊరి చివరి నుంచి స్థానిక బస్టాండ్ వరకూ దాదాపుగా రెండు కిలోమీటర్ల జాతీయ రహదారి పనులు చేయకుండా గుంతలు తవ్వి వదిలేశారు. ఈదారిపై నిత్యం వందల వాహనాలు తిరుగుతుండటంతో విపరీతంగా ధూళి లేస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దీంతో శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం కోసం ఐదేళ్లుగా రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. అయినా ప్రభుత్వంలో, అధికార యంత్రాం గంలో చలనం లేకపోయింది. ఎవరూ స్పందించక పోవటంతో గ్రామంలోని యువకులు విరాళాలు సేకరించి ట్రాక్టర్లు, లారీలతో కొండ గరుసును తరలించి జాతీయ రహదారిపై గుంతలకు మట్టిని వేసి జేసీబీలతో చదును చేయించారు. మా ఊరి రహదారిని ఇంకెప్పుడు బాగు చేస్తారంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మట్టి తోలుతున్న ట్రాక్టర్, టిప్పర్

కంకర పోస్తే.. తారు ఎవరేస్తారు?

మారుతీనగర్ కాలనీవాసులకు తప్పని తిప్పలు

గార్లదిన్నె, ఏప్రిల్ 29: తారు రోడ్డు వేస్తామని అప్పటి వరకు ఉన్న మట్టి రోడ్డును తవ్వేశారు. రోడ్డుపై కంకర వేశారు. తరువాత సిమెంట్ కానీ, తారు కానీ వేయడం మరచిపోయారు. దీంతో అది కంకర రోడ్డుగా మారిపోయింది. ఇదీ మండలంలోని కల్లూరు గ్రామం కొండకింద మారుతీనగర్‌లో రోడ్డు దుస్థితి. కాలనీ నుంచి సింగరప్ప కొండ దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారి పనులను సుమారు రూ.90 లక్ష ల ఉపాధి నిధులతో ఆరునెలల కిందట ప్రారంభించారు. సుమారు 1.4 కిలోమీటర్ల రోడ్డు పనులు చేయాల్సి ఉంది. మారుతీనగర్ సమీపం నుంచి సింగరప్ప దేవాలయం వరకు తారురోడ్డు వేసి దాదాపు 400 మీటర్ల రోడ్డు వేయకుండా కంకర తోలి వదిలిపెట్టారు. దీంతో ఆ రోడ్డు మీదుగా నిత్యం రాకపోకలు సాగించే కాలనీ ప్రజలు, సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కంకర రోడ్డుపై ప్రయాణిస్తూ ప్రతి రోజూ ఎవరో ఒకరు ప్రమాదాలకు గురి అవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అయితే రోడ్డు పూర్తి చేయకున్నా పూర్తి చేసినట్లు బోర్డులు ఏర్పాటు చేసి పాలకులు డప్పులు కొడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులు ఎక్కడ పూర్తి చేశారో చూపించాలని నిలదీస్తున్నారు.



రోడ్డు పూర్తి చేశామని ఏర్పాటు చేసిన బోర్డు



కల్లూరు కొండ కింద మారుతీనగర్‌లో కంకరతోలి వదిలేసిన రోడ్డు

అనంత అవినీతి లెక్కలు తేలుస్తా..!

కూటమి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్



టీడీపీలో చేరుతున్న 26వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి వెంకటేశ్వరరెడ్డి, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు మున్వర్, తపోవనంలో దగ్గుబాటి ప్రచారం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 29: తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అవినీతి లెక్కలు తేలుస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీలోని తపోవనంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ డిష్‌నాగరాజు ఆధ్వర్యంలో ఆయన టీడీపీ, జనసేనా, బీజేపీ నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నగరంలో జాతీయ రహదారి విస్తరణ పనులు తప్పా.. ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. రహదారి నిర్మాణం కూడా వంకర, టిక్కర్లుగా వేశారన్నారు. అంతేకాకుండా కొన్ని చోట్ల రోడ్డు కుదించుకుపోయిందన్నారు. ఎమ్మెల్యే అనంత నగరంలో రూ.5వేల కోట్ల అభివృద్ధి పనులు చేశామని చెప్పుకొంటున్నారు. జాతీయ రహదారి రూ.340 కోట్లతో నిర్మాణం జరిగితే.. మిగిలిన రూ.4వేల కోట్లు ఎక్కడ పోయాయో ఆయనే చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూపా, గ్రామ మాజీ వైస్ సర్పంచు ఓబుళపతి, మాజీ ఎంపిటీ నాగరాజు, తెలుగురైతు రాష్ట్రకార్య నిర్వాహక కార్యదర్శి రఘునాథ రాయల్, మాజీ కార్పొరేటర్ నటేష్‌చౌదరి, నాయకులు నెట్టెం బాలకృష్ణ, చలం, అమర్, ఆది, రాజశేఖర్, హరిబాబు, శివాజీ, చిరంజీవి, డిష్‌రాము, పూలబాషా, మహిళ నాయకురాలు వెంకటలక్ష్మి, వరలమ్మ, అశ్విని, రజిని, అక్షిత పాల్గొన్నారు.

ప్రచారానికి భారీ స్పందన

అనంతపురం అర్బన్ : ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సొంత డివిజన్‌లో దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రచారానికి భారీ స్పందన లభించింది. సోమవారం 16వ డివిజన్‌లోని రహమత్ నగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాను అధికారంలోకి రాగానే అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రహమత్ నగర్‌లో ప్రజల నుంచి స్పందన, స్థానికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటే ఎమ్మెల్యే అనంతపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతోందన్నారు. తన గెలుపు ఈ డివిజన్ నుంచే ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రహమత్ బీ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, నెట్టెం బాలకృష్ణ, సంగా తేజస్విని పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

సోమవారం అనంతపురం నగరంలోని 26వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జి వెంకటేశ్వరరెడ్డి తన అనుచరులైన 250 కుటుంబాలతో టీడీపీలో చేరారు. మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ 500 మందితో కలిసి టీడీపీలో చేరారు. వీరికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణలు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన మరికొందరు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, సరిపూటి రమణ, కృష్ణకుమార్, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

ప్రముఖుల ప్రచారం

నగరంలోని పలు డివిజన్లల్లో స్థానిక నాయకులు విస్తృత ప్రచారం చేశారు. దగ్గుబాటి శ్రీ లక్ష్మీ 25,19, 41వ డివిజన్లల్లో ప్రచారం నిర్వహించారు. 13వ డివిజన్‌లో టీడీపీ కురుబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురబ నారాయణ స్వామి, యూనిట్ ఇన్‌చార్జి చెరుకూరి శివ, మారుతీ చౌదరి, 39వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, కొండవీడి సుధాకర్ నాయుడు, కొండవీటి భావన, చేపల హరిలు, 11వ డివిజన్‌లో నాయకులు విజయ్‌కుమార్, నాగలక్ష్మి, మంజునాథ్ ప్రచారం నిర్వహించారు.



ప్రచారం నిర్వహిస్తున్న దగ్గుబాటి శ్రీ లక్ష్మీ

ప్రకాష్‌రెడ్డీ.. నువ్వు అవినీతిలో తోపు..!

కూటమి రాప్తాడు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

అనంతపురంరూరల్, ఏప్రిల్ 29: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అవినీతి తోపని టీడీపీ, జనసేన, బీజేపీ రాప్తాడు నియోజకవర్గం కూటమి అభ్యర్థి పరిటాల సునీత అన్నారు. సోమవారం మండలంలోని నరసనాయని కుంట, సోములదొడ్డి, తాటిచెర్లలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. పేదవాడికి ఇల్లు కట్టించే స్కీమ్‌లో ఎమ్మెల్యే రూ.250 కోట్ల అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తి మరోసారి గెలిస్తే ఆ అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోతుందన్నారు. ఓటమి తప్పదని గ్రహించిన ఆ సోదరులు ఎక్కడికక్కడ దాడులకు తెగబడు తున్నారని మండిపడ్డారు. వారు ఇంకా గెలవకనే ఇలాంటి అరాచకాలు చేస్తున్నారంటే మరోసారి ఎమ్మెల్యే అయితే ప్రజల పరిస్థితి ఎంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకాసూర్య నారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాములరాయి రఘు, రాష్ట్ర కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాములరాయి వెంకటేష్, జనసేన రాప్తాడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ సాకే పవన్‌కుమార్ పాల్గొన్నారు.



నరసనాయనికుంటలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి పరిటాల సునీత

వైసీపీ నుంచి టీడీపీలోకి..

రామగిరి : నియోజకవర్గంలో పలు గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. సోమవారం వేరువేరుగా జరిగిన కార్యక్రమాల్లో రామగిరి మండలం నసనకోట, కొత్తగాది కుంట, మాధాపురం, రామగిరి, తిమ్మాపురం గ్రామాలకు చెందిన 25 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అనంతపురంలో అక్కంపల్లి, బొందిరేపల్లి, రాప్తాడు గ్రామాలకు చెందిన 40 కుటుంబాలు, పరిటాల సిద్ధార్థ ఆధ్వర్యంలో కందుకూరు, పూలకుంట్లకు చెందిన 15 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి.

కుటుంబ సభ్యుల ప్రచారం

రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పరిటాల కుటుంబ సభ్యులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఓ వైపు పరిటాల రవి సోదరి ఉష, మరో వైపు కోడళ్లు పరిటాల జ్ఞాన, తేజస్వి, ఇతర కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహిం చారు. మండ లంలోని పేరూరులో పరిటాల రవీంద్ర పెద్దకో డలు పరిటాల జ్ఞాన, అనంతపురం రూరల్ మండలంలో అక్కంపల్లిలో పరిటాల రవీంద్ర సోదరి ఉష, చిన్నకోడలు తేజస్వి, ఇతర కుటుం బ సభ్యులు ప్రచారం నిర్వహించారు. కురుకుం ట్ల పంచాయతీలో పరిటాల శైలజ ప్రచారం నిర్వహించారు.

పింఛన్ల పంపిణీపై వైసీపీ వికృత రాజకీయాలు

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 29: సామాజిక పింఛన్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం భారీ కుట్ర చేసిందని, వికృత రాజకీయాలకు పాల్పడుతోందని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు మండిపడ్డారు. ప్రతి లబ్ధిదారుడికి ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీ డీఓ శోభారాణికి మండల పార్టీ నేతలతో కలసి వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. బ్యాంక్ అకౌంట్ ద్వారా వేలాది మంది వృద్ధులు , వితంతువులకు పింఛన్ ఇవ్వడం ద్వారా అనేక ఇబ్బందులు వస్తాయ న్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నాయని, బ్యాంక్‌ల వద్ద వారు పడిగాపులు చేయడం వలన వడదెబ్బ తగలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకుంటోందనే అనే నెపాన్ని టీడీపీపైకి వైసీపీ నాయకులు నెడుతున్నారన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీలో వైసీపీ వికృత రాజకీయం చేస్తోందన్నారు. గత నెల మాదిరిగానే సచివాలయం సిబ్బందితో ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అశోక్, మాజీ ఎంపీపీ ఎస్‌కే వెంకటేశులు, కేశన్న, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున పర్వతనేని శ్రీధర్‌బాబు, తదితరులు

మీ ఇంటి బిడ్డను గెలిపించండి

ఓటర్లకు కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ వినతి

నార్పల, ఏప్రిల్ 29 : సైకిల్ గుర్తుకు ఓటు వేసి మీ ఇంటి ఆడబిడ్డనైన తనను భారీ మెజార్టీతో గెలపించాలని కూటమి శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఓటర్లను విజ్ఞప్తి చేశారు. సోమవారం నార్పలలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బం డారు శ్రావణి, అలం నరసానాయుడు నార్పల లోకి రాగానే టీడీపీ యువ నాయకులు ఆలం వెంకట నరసా నాయుడు, ఆకుల బాబు కలసి భారీ ఎత్తున మహిళలు, తెలుగు తమ్ములతో కలిసి వారికి హారతినిస్తూ, టపాసులు పేల్చి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల అంజనేయులు, పిట్టు రంగారెడ్డి, ఆకుల ప్రసాద్, ఎర్రనాగప్ప, పీఎల్ లక్ష్మీనారాయణ, ఆకుల అనిల్ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేయాలి

బుక్కరాయసముద్రం : ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బండారు శ్రావణిశ్రీ డిమాండ్ చేశారు. బ్యాంక్ ఖాతాల్లో పింఛన్లు జమ చేస్తే వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతారన్నారు. గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ఎండ దెబ్బకి తాళలేక అనేక మంది మరణించారని, ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం అదే తప్పు చేస్తోందని అన్నారు. వైసీపీ కుట్ర వల్లే పెన్షన్ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేస్తామని అన్నారు.



నార్పలలో మహిళలకు కరపత్రాలను అందజేస్తున్న బండారు శ్రావణి

నేడు పుట్లూరు మండలంలో ప్రచారం

శింగనమల : శింగనమల టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ మంగళవారం పుట్లూరు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని గురుగు చింతలపల్లి కోమటికుంట్ల, ఎస్ గూడూరు, నాగిరెడ్డి పల్లి పుట్లూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారు.

పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాలకు..

అనంతపురం క్రైం, ఏప్రిల్ 29: నగరపాలిక పరిధిలో పింఛన్‌దారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే పింఛన్ డబ్బులు వేస్తామనినగర కమిషనర్ మేఘస్వరూప్ తెలిపారు. నగరంలో 23,497 మంది పింఛనుదారులున్నారని, 16,238 మందికి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని అన్నారు. మిగిలిన 7,259 మందికి సచివాలయ సిబ్బంది వారి ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తారన్నారు. పింఛన్‌దారులు ఎవరూ సచివాలయం వద్దకు లేదా ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పింఛన్‌దారులు గురువారం బ్యాంకుకు వెళ్లి నగదు డ్రా చేసుకోవాలని సూచించారు. ఏ కారణం చేతైనా బ్యాంకు ఖాతాకు జమ కాకపోతే అలాంటి వారికి శుక్రవారం ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేస్తామన్నారు.

2న హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 29: హజ్ యాత్రకు వెళ్లనున్న వారికి గురువారం ఉదయం 8.30 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా హజ్ కమిటీ కన్వీనర్ మౌలానా ముస్తాక్ అహ్మద్ బఖావి ఓ ప్రకటనలో వెల్లడించారు. జిల్లా వైద్యశాఖాధికారి సమక్షంలో హజ్ యాత్రికులకు పలు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. కాబట్టి హజ్ యాత్రికులు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94400 17720 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అర్బన్ బరిలో 15 మంది ..

అనంతపురం క్రైం, ఏప్రిల్ 29 : అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే స్థానానికి మొత్తం 21 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో ఆరుగురు ఉపసంహరించుకోవడంతో బరిలో 15 మంది మిగిలారు. సోమవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమక్షంలో గ్రంధి వెంకటేష్ సమక్షంలో ఆరుగురు అభ్యర్థులు తన నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు టీపీ.రామన్న, షేక్ మసూద్ వలి, ఇండ్లకిరణ్‌కుమార్, వై.మారుతి, యాలక సులోచన, బెల్లం రాంబాబులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అదేవిధంగా అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. కాగా, మొత్తం 15 మందిలో ఏడుగురు అభ్యర్థులు స్వతంత్ర్య అభ్యర్థులు ఉన్నారు.

రాప్తాడు బరిలో..

రాప్తాడు : రాప్తాడు శాసనసభ స్థానానికి నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. మొత్తం 15 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా... అందులో ఇద్దరు స్వతంత్య అభ్యర్థులు ఉపసంహరించుకున్నారని, దీంతో బరిలో 13 మంది మిగిలారని రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు తెలిపారు. టీడీపీ కూటమి అభ్యర్థి పరిటాల సునీత, వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది ఆంధ్ర శంకరయ్య, స్వతంత్య అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు.

శింగనమల బరిలో..

శింగనమల : మొత్తం 16 మంది నామినేషన్లు వేయగా... అందులో ఇద్దరు నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనుు వెన్నెల తెలిపారు. దీంతో బరిలో 14 మంది ఉన్నట్లు చెప్పారు. టీడీపీ కూటమి అభ్యర్థిగా బండారు శ్రావణిశ్రీ , వైసీపీ అభ్యర్థిగా మాన్నెపాకుల వీరాంజినేయులు, కాంగ్రెస్ అభ్యర్థిగా సాకే శైలజనాథ్ తదితరులు బరిలో ఉన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

రాప్తాడు, ఏప్రిల్ 29: వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదివారం సాయంత్రం రాప్తాడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో రాప్తాడు ఫీల్డ్ అసిస్టెంట్ సాకే మునీంద్ర పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా మునీంద్ర వైసీపీ తరపున ప్రచారం చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

బుక్కరాయసముద్రం : బుక్కరాయసముద్రం ఫీల్డ్ అసిస్టెంట్ రవికుమార్ వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో అతన్ని విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ శోభరాణి తెలిపారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్ : బాస్కెట్‌బాల్ ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు బుధవారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసి యేషన్ అధ్య క్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జననధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడా సామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు మే 21 నుంచి విజయవాడలోని మేరీ స్టెల్లా కాలేజీలో నిర్వహించే 7వ యూత్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 93937 11324ను సంప్రదించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ

అనంతపురం క్రైం,ఏప్రిల్ 29 : జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ సోమవారం రాత్రి నగరంలోని త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలు, కాలనీల్లో ఉంటున్న సమస్యలు, శాంతిభద్రతల గురించి ఆరా తీశారు. ఆయన వెంట సీఐలు ధరణికిషోర్, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

దాడి ఘటనలో పరస్పర కేసులు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 29 : రిటైర్డ్ ఉద్యోగి, ఆటో డ్రైవర్ మధ్య జరిగిన దాడి ఘటనలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తపోవనం సర్కిల్ సమీపంలో ఇంటి ఎదుట ఉంచిన ఆటో విషయంపై యజమాని దళవాయి రాము, డ్రైవర్ భూపతి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మరోసారి ఆటో డ్రైవర్ తన స్నేహితులను పిలుచుకొచ్చి దాడికి దిగాడు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. విచారించిన నాలుగో పట్టణ పోలీసులు పరస్పర కేసులు నమోదు చేశారు.

నేడు దగ్గుబాటి ప్రచారం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29 : అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ మంగళవారం ఉదయం 7 గంటలకు 17వ డివిజన్ పరిధిలోని ప్రకాష్‌రోడ్డు, మల్లేశ్వరరోడ్డు, కొత్తూరు అమ్మవారిశాల పరిసర ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తారు. ఆ తర్వాత 18వ డివిజన్‌లోని గుల్జార్‌పేట, ఆదిమూర్తి నగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తారు.

చేపల గుంతలో పడి వ్యక్తి మృతి

ధర్మవరంరూరల్, ఏప్రిల్29: మండలంలోని వెంకటతిమ్మాపురంలో చేపలగుంతలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బెళుగుప్ప మండలం కోనంపల్లి గ్రామానికి చెందిన ఎరికలసురేష్(40) వెంకటతిమ్మాపురంలో మంగళవారం జరిగే బోనాల కార్యక్రమానికి బంధువు ఇంటికి వచ్చాడు. సాయంత్రం గ్రామసమీపంలో ఉన్న చేపల గుంత వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారిపడి గుంతలో పడ్డాడు. అందులో నీరు అధికంగా ఉండటంతో పాటు పాచి ఎక్కువగా ఉండటంతో బయటకు రాలేక ఊపిరాడక మృతిచెందాడు. మృతుడికి భార్య గంగమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

పెద్దవడుగూరు: మండలంలోని కిష్టిపాడు గ్రామ సమీపం సోమవారం ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొన్న సంఘటనలో పుట్లూరు మండలం గరుగుచింతలపల్లి గ్రామానికి చెందిన మంజుల నాగేష్ (32) మరణించాడు. కర్నూలు జిల్లాలోని ప్యాపిలి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుకవైపు నుంచి బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నాగేష్‌కు భార్య అంజలితోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.





ఓపీకి ఉక్క పోత

జిల్లా సర్వజన ఆసుపత్రిలో వైద్యం ఆ దేవుడెరుక. ఇక్కడికి వచ్చిన రోగులకు ఓపీ చీటీ దొరకడమే గగనమై పోతోంది. అసలే ఎండాకాలం. ఎండలు విపరీతంగా మండిపోతుండడంతో ఉక్కపోత జనాన్ని అల్లాడిస్తోంది. సోమవారం ఆసుపత్రికి వందలమంది రోగులు చికిత్స కోసం వచ్చారు. ఇక్కడ ఓపీ కేంద్రాల వద్ద రోగులు బారులుతీరారు. పైన రేకులు షెడ్డు ఉండడంతో ఎండ వేడిమికి ఓపీ కేంద్రాలలో ఉన్న రోగులు ఉక్కపోతకు తట్టుకోలేక నానా అవస్థలు పడ్డారు. ఈ రోగం పోయి.. ఇంకో రోగం వచ్చేలా ఉంది దేవుడో అని అల్లాడిపోయారు.

- అనంతపురం టౌన్









బీసీల మద్దతు ఎన్డీయే కూటమికే

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 29 : రాష్ట్ర ప్రయోజనాల కోసమే తాము ఎన్డీయే కూటమికి మద్దతునిచ్చామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంత అర్బన్ టీడీపీ కార్యాలయంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్, బీసీల అభివృద్ధి , సంక్షేమం కోసమే తాము ఎన్డీయే కూటమికి మద్దతునిచ్చామన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి రవిచంద్రకు వైసీపీ ప్రభుత్వం ఏడు నెలలుగా సరైన పోస్టింగ్ ఇవ్వలేదన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మరో సీనియర్ ఐఏఎస్ అధికారికి అన్యాయం చేశారన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లల్లో తీరని అన్యాయం చేశారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాన్, మోదీ త్రిమూర్తులు కలిశారని, వీరి నాయకత్వంలో రాష్ట్రానికి న్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు మాయమాటలతో నట్టేట ముంచిన జగన్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణ పాఠం చెప్పాలన్నారు. బీసీలంతా ఏకమై, కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ... టీడీపీ మొదటి నుంచి బీసీల పార్టీ అన్నారు. ఈ సారి పార్టీని గెలిపిం చేది కూడా బీసీలేనన్నారు. తాము అధికారంలోకి రాగానే టవర్ క్లాక్ వద్ద బ్రిడ్జికి మహాత్మాజ్యోతిరావు పూలే పేరు పెడతామని, అనంత అర్బన్‌లో బీసీ భవన్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర, నాయకులు క్రాంతికుమార్, నాగమల్లేశ్వరరావు, జశ్వంత్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న శంకర్‌రావు

ఫోర్టో రాష్ట్ర చైర్మన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

అనంతపురం విద్య, ఏప్రిల్ 29: ఫోర్టో రాష్ట్ర చైర్మన్, నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇతర ఉద్యోగుల సమస్యలపై తన అభిప్రాయం మాత్రమే చెప్పారని, అయితే ఆయనను సస్పెండ్ చేయడం ఏమాత్రం సరికాదని, అధికారులు వెంటనే హరికృష్ణ సస్పెన్షన్ ఎత్తివేయాలని ఫోర్టో జిల్లా చైర్మన్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణరెడ్డి, రాష్ట్ర ముఖ్య సలహదారులు శివానందరెడ్డి ఆ ప్రకటనలో కోరారు.

చీనీకాయలు టన్ను రూ.33వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 29: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.33 వేలు, కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.21 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 501 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 29: నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్ టెక్నాలజీపై ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 60 రోజుల పాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లీష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సులలో నిరుద్యోగ యువతీ, యువకులకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ కల్పిస్తామన్నారు. 20-35 సంవత్సరాలు వయస్సు కలిగి ఇంటర్, డిప్లోమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉపాధి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 73969 50345, 7780 752418ను సంప్రదించాలని కోరారు.

జోరుగా టీడీపీ ప్రచారం

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 29 : బుక్కరాయసముద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్, కేశన్న, ఎస్‌నారాయణస్వామి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

మండలంలోని పసులూరులో వైసీపీ నుంచి టీడీపీలోకి 50 కుటుంబాలు బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో సోమవారం చేరాయి. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యాక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, రామక్రిష్టారెడ్డి, గంపన్న పాల్గొన్నారు.

గార్లదిన్నె : జగన్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని... వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని శింగనమల నియోజకవర్గం టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. మండలంలోని యర్రగుంట్లలో కూటమి అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ సోదరి బండారు కిన్నెర శ్రీ, స్థానిక నాయకులతో కలసి అయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647

AJA- 176988

కావలెను

ప్రముఖ ఆఫీస్ నందు పని చేయుటకు అనుభవం కల్గిన అకౌంటెంట్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను JK.Enterprises, Opp Montessori School, Gooty Road, ATP, Cell:8008803109.

AJA-189403

గజమాలతో కేశవ్‌కు ఘన స్వాగతం


గజమాలతో కేశవ్‌ను సత్కరిస్తున్న జనార్దనపల్లి టీడీపీ నాయకులు

విడపనకల్లు, ఏప్రిల్ 29: మండలంలోని జనార్దనపల్లిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్‌కు భారీ గజమాలతో గ్రామస్థులు, మహిళలు సోమవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్‌షోలో పయ్యావుల మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ టీడీపీకి మద్దతు ఇచ్చి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మండలంలోని పెద్ద కొట్టాలపల్లి, విడపనకల్లు, వేల్పుమడుగు, జనార్ధనపల్లి, వీ కొత్తకోట, ఆర్ కొట్టాల గ్రామాల్లో ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలోని మహిళలకు ఆసరా డబ్బులు వేస్తున్నాని ఉత్తుత్తి బొటన్ నొక్కి మోసం చేశాడన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ప్రతి ఒక్కరు ఆలోచించి టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలన్నారు. నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందించి ఆర్థికంగా ఎదిగేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుంది అన్నారు. పేదల అభివృద్ధికి పాటుపడుతున్న టీడీపీ సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలి అన్నారు. రోడ్డు షోలో పలువురు వైసీపీ నాయకులు కేశవ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. తిప్పారెడ్డి, చంద్రశేఖర్, తిమ్మరాజు, జనార్ధన నాయుడు, మండల కన్వీనర్ టీడీ చిన్న మారయ్య, లాయర్ ప్రతాప్ నాయుడు, అమరేంద్ర, రవీంద్ర, హరీష్‌బాబు, మద్దిపాట్ల శ్రీనివాసులు, లక్ష్మీప్రసాద్, నూతేటి రామక్రిష్ణ, డీ దేవేంద్రప్ప, మాజీ సర్పంచ్ రామాంజనేయులు, వాల్మీకి హనుమంతు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తనయులు ప్రచారం

ఉరవకొండ: వజ్రకరూరు మండలంలోని కొనకొండ్లలో ఎమ్మెల్యే తనయులు విక్రమ్ సింహా, విజయ్‌సింహా సోమవారం ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాగేంద్ర, మండిఎర్రిస్వామి, దస్తగిరి పాల్గొన్నారు.


ప్రచారంలో ఎమ్మెల్యే తనయులు

చీనీ చెట్లు, డ్రిప్ పరికరాలు దగ్ధం

అనంతపురం, ఏప్రిల్ 29: మండలంలోని జల్లిపల్లి గ్రామ రైతు నాగరాజుకు చెందిన చీనీ తోటలో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పంట దగ్ధమైంది. ప్రమాదంలో ఐదేళ్ల చీనీ చెట్లుతో పాటు డ్రిప్ పరికరాలు కాలిపోవడంతో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటిలోని సామాగ్రి...

బెళుగుప్ప: మండల కేంద్రానికి చెందిన ఎర్రమ్మ ఇంటిలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంటి సామాగ్రి దగ్ధమైంది. ఉన్నట్లుండి ఇంట్లో నుంచి పొగలు రావడంతో చుట్టుపక్కల వారు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించారు. శనివారం బంధువుల ఊరికి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 29: కంబదూరు మండల అచ్చంపల్లి గ్రామ సమీపంలో సోమవారం అక్రమంగా కర్ణాటక నుంచి ఆంధ్రకు తరలిస్తున్న 1344 టెట్రా ప్యాకెట్లను కంబదూరు పోలీసులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు మండలంలోని అచ్చంపల్లి గ్రామ సమీపంలో మూడు ద్విచక్రవాహనాలలో నలుగురు వ్యక్తులు అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులను చూసి ముగ్గురు వ్యక్తులు పారిపోగా కనగాపల్లికి చెందిన ఎరికల గుజ్జల బ్రహ్మయ్యను, మూడు ద్విచక్రవాహనాలను, మద్యాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వ్యక్తి అరెస్టు: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని శెట్టూరు పోలీసులు అరెస్టు చేశారు. రాయదుర్గం పట్టణానికి చెందిన అనిల్ ద్విచక్రవాహనంలో 180 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా ఎస్ఐ రాంభూపాల్ స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే మండల పరిధిలోని పాల్వాయి గ్రామ శివారులో నాటుసారాను విక్రయిస్తున్నారని సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. శారదాబాయిని అరెస్టు చేసి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

నగదు చోరీ

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 29: పట్టణంలో యూనియన్ బ్యాంక్ వద్ద సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పల్లేపల్లి గ్రామానికి చెందిన రైతు తిప్పారెడ్డికి సంబంధించిన రూ.4.70 లక్షలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. రైతు యూనియన్ బ్యాంక్‌లో క్రాప్‌లోన్ రెన్యువల్ కోసం ద్విచక్రవాహనంలోని సైడ్‌బ్యాగ్‌లో ఉంచి ఓచర్ తెచ్చేందుకు బ్యాంకులోకి వెళ్లి తిరిగి వచ్చి బండి వద్ద చూడగా నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

పెద్దవడుగూరు, ఏప్రిల్29: మండలంలోని కిష్టిపాడు గ్రామ సమీపం 67జాతీయ రహదారిలో సోమవారం ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొన్న సంఘటనలో పుట్లూరు మండలం గరుగుచింతలపల్లి గ్రామానికి చెందిన మంజుల నాగేష్ (32) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తిగత పనుల నిమిత్తం కర్నూలు జిల్లాలోని ప్యాపిలి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుకవైపు నుంచి బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. నాగేష్‌కు భార్య అంజలితోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలు

గుత్తిరూరల్, ఏప్రిల్ 29: మండలంలోని కొత్తపేట గ్రామశివారులో 44వ జాతీయ రహదారిపై సోమవారం వాటర్ ట్యాంకును లారీ ఢీకొన్న ప్రమాదంలో లారీ డ్రైవరుకు గాయాలయ్యాయి. శింగనమలకు చెందిన లా రీ డ్రైవర్ రాజు లారీని కర్నూలు నుంచి అనంతపురంకు వెళ్తుండగా ముం దుర వెళ్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఢీ కొట్టడంతో రాజుకు తీవ్రగాయాలయ్యా యి. స్థానికులు డ్రైవర్‌ను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చేపల గుంతలో పడి వ్యక్తి మృతి

ధర్మవరంరూరల్, ఏప్రిల్29: మండలంలోని వెంకటతిమ్మాపురం గ్రామంలో చేపలగుంతలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థులు, రూరల్ పోలీసులు తెలిపిన మేరకు అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం కోనంపల్లి గ్రామానికి చెందిన ఎరికల సురేష్(40) వెంకటతిమ్మాపురంలో మంగళవారం జరిగే బోనాల కార్యక్రమానికి వెంకటరమణ అనే బంధువు ఇంటికి వచ్చాడు. సాయంత్రం గ్రామసమీపంలో ఉన్న చేపల గుంత వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారిపడి గుంతలో పడ్డాడు. అందులో నీరు అధికంగా ఉండటంతో పాటు పాచి ఎక్కువగా ఉండటంతో బయటకు రాలేక ఊపిరాడక మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు హుటాహుటినా ఘటనాస్థలికి వెళ్లి సురేష్‌ను బయటకు తీసి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య గంగమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పేదలు బతకడం ఎమ్మెల్యేకు ఇష్టం లేదు: జేసీపీఆర్

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 29: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి పేదలు బతకడం ఇష్టం లేదని, వారి ఉపాధి మార్గాన్ని దెబ్బతీయడమే ఆయనకు ఆనందమని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఉన్న తొలగించిన రేకులషెడ్డును మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండురోజులక్రితం ఈ షెడ్డుకు సమీపంలో సీఎం బహిరంగసభ నిర్వహించాడన్నారు. కానీ షెడ్డుకు సభ జరగడానికి ఎలాంటి ఇబ్బంది లేకపోయినా ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదన్నారు. షెడ్డురేకులు తీసేయడంతో మూడు రోజుల నుంచి వారు ఉపాధి లేక దిక్కుతోచనిస్థితిలో పడ్డారన్నారు. అయినా నిన్ను చూసి ఎవరూ ఓట్లు వేయలేదని, జగన్ బొమ్మ చూసి ఓట్లు వేయడంతో ఎమ్మెల్యే అయ్యావు, నీకు ప్రజల కష్టాల ఎలా తెలుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాధిత చిరువ్యాపారులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల పరిశీలకుడు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 29: పట్టణ, మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎన్నికల అబ్జర్వర్ మనీష్‌సింగ్ పరిశీలించారు. పట్టణ సమీపంలోని కడపరోడ్డులో ఉన్న చెక్‌పోస్టును తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అంతకుమునుపు ఆర్‌ఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై పలు సలహాలు, సూచనలు అందించారు. రికార్డులతోపాటు నామినేషన్ల ఉపసంహరణ పత్రాలను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ రాజ, డీఎస్పీ గంగయ్య, సిబ్బంది ఉన్నారు.

చెక్‌పోస్టుల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గంరూరల్: ఎన్నికల సమయంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పోలీసుసిబ్బందికి డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం పట్టణ సమీపంలోని పైతోట మారెమ్మగుడి వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రూరల్ సీఐ ప్రసాద్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


డీఎస్పీతో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు




6వ వర్ధంతి

మంచికి, మానవత్వానికి, మమతానురాగాలకు మారు పేరుగా నిలిచి ఆత్మీయుల హృదయాలలో నిలిచిన **మూతి చర్మాల ఓబులేసు** గారు మా నుండి దూరమై నేటికి 6 సంవత్సరాలు గడిచినను మీ మధుర జ్ఞాపకాలు మా మదిలో మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ మూతి చర్మాల ఓబులేసు గారు
టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్,
శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్త, తాడిపత్రి
మరణం : 30-04-2018

భార్య : శ్రీమతి కీ॥శే॥ మూతి రామలక్ష్మి

ఇట్లు..

మూతి కుటుంబసభ్యులు

శ్రీ లక్ష్మీదుర్గ షాపింగ్ కాంప్లెక్స్, ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర, సిబి రోడ్డు, తాడిపత్రి

బీటీపీ నీటితో కళ్యాణదుర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం

● రోడ్‌షోలో అమిలినేని సురేంద్రబాబు

కుందుర్పి, ఏప్రిల్ 29: బీటీపీ నీటిని తీసుకువచ్చి కళ్యాణదుర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. మండలంలోని శీగలపల్లి, మలయనూరు, నాగేపల్లి, గొల్లరహట్టి, నిజవల్లి, వెంకటంపల్లి, శ్రీమజ్జనపల్లి, తమ్మయ్యదొడ్డి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అమిలినేనికి టీడీపీ నాయకులు, మహిళలు, గ్రామస్థులు పూలవర్షం కురిపించి గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదం వల్లే బీటీపీ కాలువ పనులు ఆలస్యం అయ్యిందని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆయన్ని ఒప్పించి కాలువ పనులు వేగంతంగా పూర్తి చేసి ఈ ప్రాంతంలోని అన్ని చెరువులకు నీళ్లిచ్చి ప్రజలకు మంచి చేస్తామన్నారు. అలాగే గ్రామాల్లో రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. సూపర్‌సిక్స్ పథకం ద్వారా ఇంటింటికి కొళాయిలు వేయించి ప్రజల దాహార్తి తీరుస్తామన్నారు. ఈ పనులన్నీ జరగాలంటే మే 13న ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గత ప్రభుత్వంలో నాయకులు ఈ గ్రామ ప్రజల నుంచి ఓట్లు వేయించుకున్నారే తప్ప ఏ గ్రామానికి మట్టి రోడ్డు కూడా వేసిన పాపానపోలేదన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి ఆరు కుటుంబాలు: మండలంలోని నాగేపల్లి గ్రామంలో వైసీపీ నుంచి ఆరు కుటుంబాలు అమిలినేని సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి అమిలినేని టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ టీడీపీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మండల కన్వీనర్ ధనుంజయ, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున, మాజీ ఎంపీపీ దీనమ్మ, నాయకులు పెద్ద నరసింహప్ప, మంజునాథరెడ్డి, రామకృష్ణ, సంజీవ, గంగాధర, రాజ్‌కుమార్, ఎర్రగుంట, ఆనంద, కర్తనపర్తి రామాంజనేయులు, రాఘవేంద్ర బాబు, ఓబయ్య అంగడి రామాంజనేయులు, షణ్ముఖ, మడవాళప్ప, తిప్పేస్వామి పాల్గొన్నారు.


ఎద్దులబండిపై ప్రచారం చేస్తున్న అమిలినేని

మహాశక్తితో ఆర్థిక చేయూత: మహాశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని అమిలినేని కుటుంబ సభ్యులు అన్నారు. మండలంలోని కరిగానిపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో సురేంద్రబాబు సోదరి రాధామాధవి, కుమార్తె చరిత, కుటుంబ సభ్యులు ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. మే 13న ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ నాగేంద్ర, మాజీ సర్పంచ్ లింగప్ప, రాఘవేంద్రబాబు, శివలింగప్ప, మోహన రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎద్దులబండిపై అమిలినేని ప్రచారం: మండలంలోని బండమీదపల్లిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎద్దులబండిలో ఉమ్మడి కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.


వృద్ధులకు సన్మానించిన అమిలినేని సురేంద్రబాబు


రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న అమిలినేని

ప్రతి పల్లెలో సమస్యలు పరిష్కరిస్తాం

● గుమ్మనూరు తనయుడు, సోదరుడు


బసినేపల్లి తండాలో ప్రచారం చేస్తున్న గుమ్మనూరు సోదరుడు

గుత్తిరూరల్, ఏప్రిల్ 29: నియోజకవర్గంలో ప్రతి పల్లెలో సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్, సోదరుడు నారాయణ హామీ ఇచ్చారు. సోమవారం మండలంలోని బసినేపల్లి, బసినేపల్లి తండా, లచ్చానిపల్లి గ్రామాలల్లో వారు ప్రచారం చేశారు. వారు మాట్లడుతూ చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేస్తే రాష్ట్రం బాగుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. టీడీపీ మండల కన్వీనర్ బర్దివలి, చిన్నరెడ్డి యాదవ్, దిల్కా శీనా, వీరేష్, సర్పంచు భరత్, ఎంపీటీసీ జింకల నారాయణస్వామి, మాజీ సర్పంచు శ్రీనివాస్ చౌదరి, సుధాకర్‌నాయుడు, ఇషాక్, గోవర్ధన్ గౌడ్, సుధీర్ గౌడ్, సాంబ శివ, రవితేజ నారాయణస్వామి ఏంకే చౌదరి, ప్రతాప్, గోవిందు, తిరుపాల్ పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించండి

గుంతకల్లు: టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గుమ్మనూరు జయరాంకు, అంబికా లక్ష్మీనారాయణకు ఓటువేసి గెలిపించాలంటూ టీడీపీ నాయకుడు గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక 30వ వార్డులో సోమవారం సాయంత్రం టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. టీడీపీకి ఓటువేసి రాష్ట్రాన్ని కాపాడాలని ఓటర్లను కోరారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, ఆంజి, శివన్న, ఉమ పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి

పామిడి: తెలుగుదేశం పార్టీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి సాధ్యపడుతుందని కూటమి అసెంబ్లీ అభ్యర్థి జయరాం సోదరుడు నారాయణస్వామి కుమారుడు గుమ్మనూరు మదన్ అన్నారు. పట్టణంలోని 13, 14, 18వ వార్డులలో సోమవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దాసరి లక్ష్మికాంతమ్మ, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గోసపీరా, బొల్లు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉల్లాసంగా గాడిదల పరుగుపందెం పోటీలు

ఉరవకొండ, ఏప్రిల్ 29: వజ్రకరూరు మండల కేంద్రంలో జనార్దన వేంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని గాడిదల పరుగు పందెం పోటీలు ఉల్లాసంగా సాగాయి. రజకసంఘం నాయకుల ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఎనిమిది గాడిదలు పాల్గొన్నాయి. నేమకల్లు, మురిడికి చెందిన తిప్పేస్వామి గాడిదలు మొదటి బహుమతి దక్కించుకున్నాయి. రాయదుర్గం మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన మల్లేష్ గాడిద రెండో స్థానం దక్కించుకున్నాయి. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.8వేలను నిర్వహకులు సురేంద్ర, గురుస్వామి, సురేష్ అందజేశారు.


పరుగు పందెంలో పాల్గొన్న గాడిదలు

రేషన్‌బియ్యం పంపిణీ చేయరా?

యాడికి, ఏప్రిల్ 29: ఏప్రిల్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం ఇంతవరకు తమకు పంపిణీ చేయలేదని, సంబంధిత అదికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక నాగులకట్టవీధి వాసులు సోమవారం ఆర్ఐ ఆనంద్‌బాబుఆచారికి ఫిర్యాదుచేశారు. వారు మాట్లాడుతూ ఏప్రిల్ ముగుస్తున్నా తమకు ఇంతవరకు రేషన్ బియ్యం పంపిణీ చేయలేదన్నారు. సంబంధిత పంపిణీదారున్ని అడిగితే నా ఇష్టం ఉన్నప్పుడు పంపిణీ చేస్తాను అప్పుడు వచ్చి తీసుకోండి అని చెబుతున్నాడని కాలనీవాసులు వాపోయారు. రేషన్ బియ్యం అడిగిన కాలనీవాసులపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడని వారు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని బియ్యం పంపిణీ అయ్యేలా చూడాలని కోరారు. దీనిపై ఆర్ఐ మాట్లాడుతూ సంబంధిత రేషన్ బియ్యం పంపిణీదారునితో మాట్లాడి కాలనీవాసులకు రేషన్ బియ్యం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వలంటీర్‌కు దేహశుద్ధి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 29: మండలంలోని ఓ గ్రామంలో వలంటీర్‌కు గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు శ్రీరాములు అనే వలంటీర్ అదే గ్రామంలోని ఓ మాజీ మహిళా వలంటీర్‌తో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వాట్సప్‌ల్లో అసభ్యకర పోస్టులు పెట్టడంతో, వలంటీర్ అక్కాచెల్లెళ్లు కలిసి దేహశుద్ధి చేశారు. స్థానికులు కలగజేసుకుని పోలీసుస్టేషన్ వరకు వెళ్లకుండా ఇరువురికి నచ్చజెప్పినట్లు తెలిసింది.

తాడిపత్రి అభివృద్ధికి సహకరించండి: అశ్మిత్ రెడ్డి


ప్రచారంలో చిన్నారిని ఆప్యాయంగా పలకరిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్29: సైకిల్ గుర్తుకు ఓటువేసి తాడిపత్రి అభివృద్ధికి సహకరించాలని కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని గాంధీనగర్‌లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. టీడీపీకి అండగా నిలబడి అభివృద్ధికి బాటలు వేయాలని ఆయన ప్రజలను కోరారు. ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జేసీ సోదరులను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు: స్థానిక నివాసంలో సోమవారం జేసీ సోదరులను టీడీపీ నూతన జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిలను కలిసి శాలువాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష పదవి ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి తన శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఆయన తెలిపారు. అనంతరం కాకర్ల జయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన 13కుటుంబాల సభ్యులకు వెంకటశివుడుయాదవ్ పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సజ్జలదిన్నెకు చెందిన రంగనాథ, రంగయ్య, రమేష్, కంబగిరి, మల్లికార్జున, శీనయ్య, దేవేంద్ర ఉన్నారు.

టీడీపీతోనే రామరాజ్యం: టీడీపీ పాలనతోనే రామరాజ్యం సాధ్యమవుతుందని టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని గన్నెవారిపల్లి, తిప్పారెడ్డిపల్లి, రెడ్డికాలనీల్లో ఆయన పర్యటించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అశ్మిత్‌రెడ్డి మేనల్లుడి ప్రచారం: మండలంలోని గన్నెవారిపల్లికాలనీలో సోమవారం కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి మేనల్లుడు గుణపాటి విరాజ్‌రెడ్డి ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.


టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న జిల్లా అధ్యక్షుడు

మెగా డీఎస్సీపైనే తొలి సంతకం

● కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఏప్రిల్ 29: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువత కోసం మెగా డీఎస్సీపైనే తొలిసంతకం చేయనున్నట్లు కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం పట్టణంలోని 24వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయనతో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మంజునాథగౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గౌస్ పాల్గొన్నారు. ఓటర్లకు సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రం అభివృద్ధికి చిరునామాగా మారుతుందని స్పష్టం చేశారు.


ఓటు అభ్యర్థిస్తున్న కాలవ శ్రీనివాసులు

50 కుటుంబాలు చేరిక


టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన కొత్తపల్లి కుటుంబాలు

కణేకల్లు మండలంలోని గోపులాపురం గ్రామానికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు, గుమ్మఘట్ట మండలంలోని ఆర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన 40 కుటుంబాలు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆర్ కొత్తపల్లికి చెందిన జశ్వంత్, ప్రహ్లాద, తిప్పేస్వామి, రామాంజనేయులు, పెన్నప్ప, ఎల్లప్ప, శ్రీనివాసులు, రామచంద్ర, వన్నూరుస్వామి, ఉమేష్, మారెన్న, రమేష్, అభిషేక్‌లతో పాటు 30 కుటుంబాలు చేరాయి. గోపులాపురం గ్రామానికి చెందిన హనుమప్ప, ప్రవీణ్, రవి, ప్రభాకర, ఆంజనేయులతో పాటు ఐదు కుటుంబాలు చేరాయి. వీరికి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

కుటుంబ సభ్యుల ప్రచారం: తన తండ్రిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కాలవ శ్రీనివాసులు కుమార్తె కాలవ గౌతమి సోమవారం కణేకల్లు మండలంలోని యర్రగుంట గ్రామంలో, తనయుడు కాలవ భరత్ గుమ్మఘట్ట మండలంలోని వీరాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే విధంగా డీ.హీరేహాళ్ మండలంలోని గొడిశలపల్లిలో అల్లుడు అనిల్‌కుమార్ ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..: కాలవ శ్రీనివాసులును గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, ప్రధాన కార్యదర్శి వెంక టేష్ ఎన్నికల ప్రచారాన్ని డీ.హీరేహాళ్ మండలంలో ఓబుళాపురం, జాజరకల్లు, డీ.హీరేహాళ్, లింగమనహళ్లిలోని ఎస్సీ కాలనీలలో ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

ఘనంగా ఉట్లమాను ఉత్సవం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 29: కంబదూరు మండల కేంద్రంలో కమల మల్లేశ్వరస్వామి ఆలయానికి నూతనంగా నిర్మించిన తేరుకు రథోత్సవం నిర్వహించిన సందర్భంగా సోమవారం ఉట్లమాను కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘనంగా జరుపుకున్నారు. ఉట్లమానును ఎక్కేందుకు యువకులు పోటీపడ్డారు. 25 ఏళ్ల తరువాత పరుష జరపడంతో స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ఆయా గ్రామాల ప్రజలు వీటిని తిలకించేందుకు తరలివచ్చారు.


ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

మొరాయించిన 108 వాహనం

పామిడి, ఏప్రిల్ 29: వైసీపీ ప్రభుత్వంలో 108 వాహనాలు కుయ్ కుయ్ అంటూ బాధితులను దవాఖానాలకు చేరుస్తున్నాయంటూ వైసీపీ నేతలు ఉదరగొట్టారు. అయితే పామిడి ప్రభుత్వాసుపత్రిలో 108 వాహనం సోమవారం మొరాయించింది. 108 సిబ్బంది, స్థానికులు ఆ వాహనాన్ని తోసినా స్టార్ట్ అవ్వలేదు. దీంతో చూపరులు కుయ్ కుయ్ అనాల్సిన వాహనం నయ్ నయ్ అంటూ మొండికేసిందని సెటైర్లు వేశారు. అత్యవసర సమయాల్లో వాహనాలు ఇలా మొరాయిస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు.


పామిడి ప్రభుత్వాసుపత్రిలో 108 వాహనాన్ని తోస్తున్న సిబ్బంది

ముగ్గురు స్వతంత్రుల ఉపసంహరణ

గుంతకల్లు, ఏప్రిల్ 29: నామినేషన్ల ఉపసంహరణలో చివరి రోజైన సోమవారం గుంతకల్లు నియోజకవర్గంలో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు తమ అభ్యర్థిత్వాలను ఉపసంహరించుకున్నారు. మొత్తంమీద 20 నామినేషన్లు దాఖలుకాగా స్ర్కూటినీలో టీడీపీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు, వైసీపీకి చెందిన ఓ అభ్యర్థి బీ-ఫారాలను జతపరచకపోవడంతో ఆ మూడు నామినేషన్లను తిరస్కరించగా 17 మంది బరిలో ఉన్నారు. వారిలో ముగ్గురు విత్‌డ్రాచేయడంతో ప్రస్తుతం 14 మంది బరిలో మిగిలారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి...

రాయదుర్గంరూరల్: నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా స్వతంత్ర్య అభ్యర్థి గౌని ఊహారాణి తమ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు ఆర్‌ఓ కరుణాకుమారి తెలిపారు.

బరిలో 15 మంది అభ్యర్థులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం శాసన సభ నియోజకవర్గానికి సంబంధించి 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు రిటర్నింగ్ అధికారిణి రాణి సుష్మిత తెలిపారు. 26వ తేదీన జరిగిన స్ర్కూట్నిలో ఒక నామినేషన్‌ను తిరస్కరించినట్లు తెలిపారు. సోమవారం ఉపసంహరణలో భాగంగా స్వతంత్ర అభ్యర్థి తగ్గుపర్తి రామన్న నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో మిగిలిన 15 మందికి గుర్తులు కేటాయించినట్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం అను వారు క్రింద తెలిపిన ఆస్తి తాకట్టుపై కె.పద్మా పతి W/o Late ఎరుకుల ఎర్రిస్వామి D.No.4-136-B, కోటవీధి, కంబదూరు గ్రామం & మండలం అనంతపురం జిల్లా వారికి ఋణం ఇవ్వదలచు కున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంత రాలు, తకరార్లు ఉన్నయెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ అనంతపురం రూరల్ సబ్ రి॥డి॥కి చేరిన అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెం. 105లో ప్లాట్ నెం. 139. చెక్కుబంది:-తూర్పు : ప్లాట్ నెం. 138, పడమర: రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం. 134, దక్షిణం: ప్లాట్ నెం. 150.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA-176988

కావలెను

ప్రముఖ ఆఫీస్ నందు పని చేయుటకు అనుభవం కల్గిన అకౌంటెంట్ మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను JK.Enterprises, Opp Montessori School, Gooty Road, ATP, Cell:8008803109.

AJA-189403